


ముగిసిన రామయ్య ఆభరణాల అప్పగింత ప్రక్రియ

భద్రాచలం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : రామాలయంలో ఈవోల బదిలీల సమయంలో చేపట్టే స్వామి వారి ఆభరణాల అప్పగింత ప్రక్రియ శనివారం పూర్తయ్యింది. గత మూడు రోజులుగా ఇక్కడ నుంచి వేములవాడకు బదిలీ అయిన ఈవో ఎల్.రమాదేవి, ప్రస్తుత ఈవో దామోదర్‌రావుకు రామాలయానికి సంబంధించిన అన్ని రకాల ఆభరణాలు, ఫిక్స్‌డ్ డిపాజిట్లు, బ్యాంకు ఖాతాలకు సంబంధించి వివరాలను అప్పగించే ప్రక్రియ పూర్తి చేశారు. కాగా శనివారం సందర్భంగా రామాలయంలో స్వామి వారికి ఆర్జిత సేవలో భాగంగా స్వర్ణ తులసార్చన నిర్వహించారు.

సండే స్పెషల్ SUNDAY SPECIAL

అది పాలేరు జలాశయం.. జిల్లాకు సిరుల సెలయేరు పారిస్తున్న ఆధునిక దేవాలయం. నాగార్జునసాగర్ అనుసంధానంగా జిల్లాలోని సుమారు 2.85 లక్షల ఎకరాల భూములకు సాగునీటిని అందించడంతో పాటు.. ఖమ్మం నగరంతో పాటు అనేక గ్రామాల ప్రజలకు తాగునీటిని అందిస్తున్న నిజాం నవాబు కాలం నాటి తటాకం. 1922లో తవ్వకం జరిగిన ఈ చెరువు.. 1975లో నాటి సీఎం జలగం వెంగళరావు హయాంలో ఈ చెరువుకు సాగర్ కాల్వను అనుసంధానించడంతో అది బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌గా మారింది. దాంతో నాటి నుంచి ఎన్నెస్పీ రెండో జోన్ భూములకు ఇక్కడి నుంచి కృష్ణా జలాల సరఫరా జరుగుతోంది. దీంతో పాటు ఇక్కడ నిర్మితమైన మిషన్‌భగీరథ పంప్‌హౌజ్ ద్వారా నగరంతో పాటు అనేక గ్రామాల ప్రజల దాహార్తి కూడా తీరుస్తోంది. అలాగే చేపలు, రొయ్యల పెంపకం, షికారుతో మత్స్యకారులకూ ఆర్థికంగా చేయూతనందిస్తోంది. వీటికి తోడు ఇక్కడి రెండు మెగావాట్ల విద్యుదుత్పత్తి సామర్థ్యం గల కేంద్రాన్ని ఏర్పాటు చేయగా.. కాలువలో నీరు ప్రవహించినంత సేపు విద్యుదుత్పత్తి జరుగుతుంది. అది కూడా సుమారు 25పైసల ఖర్చుతో.. ఇలా బహుళ ప్రయోజనాలను అందిస్తూ జిల్లా ప్రజల కల్పతరువుగా పేరొందింది పాలేరు రిజర్వాయర్. 6

- కూసుమంచి, ఆంధ్రజ్యోతి





పాలేరు జలాశయం ఫాలింగ్ గేట్ల నుంచి నీటి పరవళ్లు (ఫైల్)

పాలేరు.. సిరుల సెలయేరు

- జిల్లా ప్రజలకు వరప్రదాయిని
- బహుళ ప్రయోజనాలందిస్తున్న జలాశయం
- లక్షలాది ఎకరాలకు సాగు నీటిని అందిస్తూ..
- లక్షల మంది గొంతులు తడుపుతున్న రిజర్వాయర్
- మత్స్యకారులకూ ఆర్థికంగా చేయూతనిస్తున్న నాటి చెరువు
- జల విద్యుత్ కేంద్రం ద్వారా తక్కువ ఖర్చుతో కరెంట్ ఉత్పత్తి



అవార్డు అందజేస్తున్న ప్రధాన న్యాయాధికారి రాజగోపాల్

రాజీయే.. రాజమార్గం

- లోక్ అదాలత్ తీర్పు.. సుప్రీం కోర్టు తుది తీర్పుతో సమానం
- జిల్లా ప్రధాన న్యాయాధికారి రాజగోపాల్
- జాతీయ లోక్ అదాలత్‌లో పలు కేసుల పరిష్కారం

ఖమ్మంలీగల్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : కోర్టు కేసుల్లో రాజీయే రాజమార్గమని, లోక్ అదాలత్‌ల ద్వారా ఇచ్చిన తీర్పు సుప్రీంకోర్టు తుది తీర్పుతో సమానమని ఖమ్మం జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.రాజగోపాల్ పేర్కొన్నారు. శనివారం న్యాయ సేవాధికారసంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌కు ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ కుటుంబ వివాదాల కేసుల్లో భార్యాభర్తల కేసులు ముఖ్యమైనవని, ఈ వివాదాల్లో ఇద్దరూ కలిసి ఉంటే వారి సంతానంతో పాటు ఇరు కుటుంబాలూ సంతోషంగా ఉంటాయన్నారు. తద్వారా ఆరోగ్యమైన సమాజం ఏర్పడుతుందన్నారు. ఇలాంటి వివాదాల్లో ఇరువర్గాలుసహనంతో పరిష్కరించుకుంటే సమయం డబ్బు, ఆదా అవుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తొండపు. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ భవిష్యత్తులో న్యాయ సేవాధికారి సంస్థలసేవలు జిల్లా వ్యాప్తంగా ప్రజల్లో తీసుకెళ్లడానికి కృషి చేయాలని, అందుకు బార్ అసోసియేషన్ పూర్తి సహకారం అందిస్తుందన్నారు. ఇక లోక్‌అదాలత్‌లో భాగంగా మోటార్‌వాహన బీమా కేసులో రూ.19.50 లక్షలకు రాజీ కుదరగా, జిల్లా న్యాయాధికారి ఆ అవార్డును అందజేశారు. బాధితుడి తరఫున న్యాయవాది పోట్రు వెంకయ్య చౌదరి, బీమాకంపెనీ తరఫున న్యాయవాది బండారుపల్లి గంగాధర్ వ్యవహరించారు. లోక్‌అదాలత్‌లో కలుసుకున్న పెద్దబోయిన మాధవి, లక్ష్మణ్ దంపతులకు న్యాయాధికారి రాజగోపాల్ అవార్డు కాపీతో పాటు పూల మొక్కను అందజేశారు. కోర్టుకు హాజరైన కక్షిదారులకు భోజన, తాగునీటి సౌకర్యాన్ని జిల్లా న్యాయసేవాధికారి సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు దేవినేని రాంప్రసాదరావు, న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి కేవీ చంద్రశేఖరరావు, ఏం.కల్పన, టి.మురళీమోహన్, కాసరగడ్డ దీప, బెక్కమ్ రజిని, ఏపూరి బిందు ప్రియ, వినుకొండ మాధవి, బి.నాగలక్ష్మి, అఖిల, న్యాయసేవాధికారిసంస్థ సభ్యులు, మధ్యవర్తులు పాల్గొన్నారు. ఈ లోక్‌అదాలత్‌లో భాగంగా ఖమ్మం కోర్టులో 4771 కేసులు, సత్తుపల్లిలో 368కేసులు, మధిర మొత్తం 732 కేసులు పరిష్కారమయ్యాయి. మోటారు వాహన ప్రమాద బీమా కేసుల్లో బాధితులకు నష్టపరిహారంగా రూ.3,16,71,251, మిగతా కేసుల్లో ప్రతివాదులకు అవార్డు కింద రూ.30,17,255 అందజేశారు.

జిల్లా ఆస్పత్రికి వచ్చిన జ్వరపీడితులు



డెంగీ దడ

- లోపించిన పరిశుభ్రత.. పెరుగుతున్న బాధితులు
- అధికారుల పాలనలో పడకేసిన పారిశుధ్య నిర్వహణ
- ఇప్పటి వరకు జిల్లాలో 171 కేసులు నమోదు
- 110 ప్రభావిత గ్రామాల గుర్తింపు

☞ కల్లూరు మండలంలోని చంద్రుపట్ల గ్రామంలో ఓ ఫార్మా విద్యార్థిని డెంగీతో మృతిచెందింది. ఐదు రోజులుగా తనకు జ్వరం వస్తూ ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృత్యువాతపడింది. ఇదే మండల పరిధిలో రెండేళ్ల క్రితం డెంగీ విజృంభించి వందలాది మంది బాధితులయ్యారు. దాంతో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు.

☞ జిల్లాలోని వివిధ మండలాల్లో 110 గ్రామాలు డెంగీ ప్రభావిత గ్రామాలుగా నమోదయ్యాయి. ఆ గ్రామాల్లో ఇప్పటి వరకు 171 పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. స్థానికంగా మెరుగైన వైద్య చికిత్సలు అంతంత మాత్రంగా ఉండడంతో బాధితులు సమీప పట్టణాల్లోని ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు.

ఖమ్మం కలెక్టరేట్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : కొద్ది రోజులుగా డెంగీ దడ పుట్టిస్తోంది. జిల్లాలో రోజురోజుకూ జ్వర బాధితుల సంఖ్య పెరుగుతుండటంతో జనం వణికిపోతున్నారు. ఏటా వానా ప్రారంభంలో పల్లెల్లో పారిశుధ్య నిర్వహణకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించేవారు. ఈ ఏడాది పంచాయతీల్లో పాలకవర్గాలు లేకపోవడంతో నిర్వహణ అంతంతమాత్రంగా ఉంది. ప్రత్యేకాధికారుల పాలన ఉన్నా పరిశుభ్రత పాటించకపోవడంతో దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. పల్లె ప్రజలు దోమకాటుకు గురవుతున్నారు. ముఖ్యంగా నెల రోజుల నుంచి జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో డెంగీ విజృంభిస్తుండగా.. మరణాలు కూడా సంభవిస్తున్నాయి. ప్రైవేటు ఆస్పత్రులతో పాటు ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే జ్వరపీడితుల సంఖ్య పెరుగుతోంది.

ప్రత్యేక నిధులులేక..

జిల్లాలో ఒక్కో ప్రత్యేకాధికారికి మూడు, నాలుగు పంచాయతీల బాధ్యతలు అప్పగించారు. దీంతో వారు చుట్టపుచూపుగా గ్రామాలకు రావడంతో పంచాయతీల పాలన అస్తవ్యస్తంగా మారింది. ఎక్కడా శుక్రవారం డ్రైడే నిర్వహించడం లేదు. గత ఆరునెలలుగా పంచాయతీలకు నిధులు మంజూరు కాకపోవడంతో పల్లెల్లో పారిశుధ్య నిర్వహణ కార్యక్రమాలు పడకేశాయి. అడపాదడపా నిర్వహిసున్నారే తప్ప మాస్ క్లీనింగ్‌ను మరిచిపోయారు. పట్టణాల్లోనూ ఇదే పరిస్థితి ఉంది. చెత్త తొలగింపు అంతంతమాత్రంగానే ఉంది. ఇంటింటికీ సరఫరా చేసే తాగునీటి నల్లాలు లీకేజీలమయమయ్యాయి. దీంతో నీరు కలుషితమై వ్యాధులు వ్యాప్తిచెందుతున్నాయి.

శాఖల మధ్య కొరవడిన సమన్వయం..

వైద్యారోగ్య కుటుంబ శాఖ అధికారులు, పంచాయతీ, (మిగతా 8వ పేజీలో)

జిల్లాలో డెంగీ కేసుల నమోదు ఇలా..

నమోదైన మొత్తం కేసులు	-	171
ఈ వారంలో నమోదైనవి	-	13
గత వారంలో నమోదైనవి	-	18
సేకరించిన మొత్తం శాంపిళ్లు	-	11,436
డెంగీ కేసులు నమోదైన పీహెచ్‌సీలు	-	28
డెంగీ ప్రభావిత గ్రామాలు	-	110

విలీన నష్టానికి సజీవ సాక్ష్యం ఇది

- 'ఆంధ్రజ్యోతి' కథనాన్ని ఎక్స్‌లో షేర్ చేసిన తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత
- చర్చనీయాంశమైన కథనం


Kavitha Kalvakuntla
@RaoKavitha
Following
Translate post
పోలవరం ముంపు పేరుతో తెలంగాణలోని ఏడు మండలాలను ఏపీలో విలీనం చేసిన కేంద్ర ప్రభుత్వ చర్య ఎన్ని నష్టాలకు దారితీసిందో చెప్పే సాక్ష్యం ఇది

నీట్ పరీక్షలో మంచి ర్యాంక్ సాధించిన భద్రాచలం పట్టణానికి చెందిన సాయి రితిక ఇటు తెలంగాణలో, అటు ఏపీలో లోకల్ క్యాండిడేట్ కాకుండా పోయారు

డాక్టర్ కావాలన్న తన కల, తల్లిదండ్రుల ఆశయానికి 'లోకల్' సమస్య అడ్డుగోడలా నిలిచింది

తెలంగాణ ప్రభుత్వం మానవతా దృక్పథంతో స్పందించి సాయి రితిక నీట్ కౌన్సెలింగ్ లో తెలంగాణ లోకల్ ఆప్షన్ ఇచ్చేలా వెసులుబాటు కల్పించాలి

నేనెక్కడ లోకల్

కల్వకుంట్ల కవిత తన ఎక్స్ ఖాతాలో చేసిన ట్వీట్

భద్రాచలం, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): 'పోలవరం ముంపు పేరుతో తెలంగాణలోని ఏడు మండలాలను ఏపీలో విలీనం చేసిన కేంద్ర ప్రభుత్వ చర్య ఎన్ని నష్టాలకు దారి తీసిందో చెప్పే సజీవ సాక్ష్యమేఇది..' అంటూ 'ఆంధ్రజ్యోతి'లో ప్రధాన సంచికలో శనివారం 'నేను ఎక్కడ లోకల్? నీట్ ర్యాంకు సాధించినా కౌన్సెలింగ్ రిజిస్ట్రేషన్‌లో నాన్ లోకల్ సమస్య. భద్రాచలం విద్యార్థిని సాయి రితికకు విభజన కష్టాలు' శీర్షికన వెలువడిన కథనాన్ని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తన ఎక్స్ ఖాతాలో పోస్టు చేశారు. ఈ సందర్భంగా నీట్ పరీక్షలో మంచి ర్యాంకు సాధించినా భద్రాచలం పట్టణానికి చెందిన సాయి రితిక ఇటు తెలంగాణలో అటు ఏపీలో స్థానికత లేకుండా పోయారని తన పోస్టులో పేర్కొన్నారు. అలాగే డాక్టర్ కావాలన్న తన కల, తల్లిదండ్రుల ఆశయానికి స్థానికత సమస్య అడ్డుగోడలా నిలిచిందంటూ పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం మానవతా దృక్పదంతో స్పందించి గర్నెపల్లి సాయి రితిక నీట్ కౌన్సిలింగ్‌లో తెలంగాణ స్థానికత ఆప్షన్ ఇచ్చేలా వెసులుబాటు కల్పించాలని ప్రభుతాన్ని కోరారు.

చర్చనీయాంశమైన 'ఆంధ్రజ్యోతి' కథనం

నీట్ ర్యాంకు సాధించినా కౌన్సెలింగ్ రిజిస్ట్రేషన్‌లో స్థానికత సమస్యపై.. విభజన కష్టాలు నేను (మిగతా 6వ పేజీలో)



సుధాకర్‌రెడ్డి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న వివిధ రాజకీయ పక్షాలు, ప్రజాసంఘాలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు

శ్రామిక పీడిత జన స్వరం.. సురవరం

- ఆయన మృతి ప్రజా ఉద్యమాలకు తీరని లోటు
- సుధాకర్‌రెడ్డి సంతాప సభలో కూనంనేని సాంబశివరావు
- ఘన నివాళులర్పించిన పలువురు ఉమ్మడి జిల్లా నేతలు

6

దంచికొట్టిన వాన

- పలుచోట్ల రోడ్లు జలమయం
- పొంగి ప్రవహించిన వాగులు
- ఖమ్మం పాతబస్టాండులో నిలిచిన నీరు

ఖమ్మం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతిప్రతినిధి) : జిల్లా వ్యాప్తంగా శనివారం వాన దంచికొట్టింది. అత్యధికంగా ఎర్రుపాలెంలో 4.5సెం.మీ., వేంసూరులో 3.6, మధిర 3.3, కల్లూరు 2.38, సత్తుపల్లి 1.85మి.మీ., పెనుబల్లి 1.0 సెం.మీ. చొప్పున వర్షపాతం నమోదైంది. మిగిలిన మండలాల్లో కూడా వర్షం పడింది. జిల్లా అంతటా విస్తారంగా వర్షం పడడంతో పంటలకు ప్రాణం పోసినట్లయింది. వారం రోజులుగా పొడి వాతావరణం ఉండటంతో మెట్ట పంటలకు కొస్త ఇబ్బంది ఏర్పడింది. ఈ క్రమంలో శనివారం కురిసిన వర్షం పత్తి, మొక్కజొన్న, కంది,పెసర, మిర్చి, చెరుకు, కూరగాయల పంటలకు, పండ్ల తోటలకు ఉపయోగపడింది.పెసర పంటకు మాత్రం స్వల్పంగా నష్టం జరిగింది. వర్షం కారణంగా జిల్లా కేంద్రం ఖమ్మంలో రోడ్లపై నీరు చేరడం, ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. ఖమ్మంపాతబస్టాండ్ వద్ద వాననీరు భారీగా ప్రవహించింది. బస్టాండ్‌లో మోకాలు లోతు నీరు నిలవడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కొన్నిచోట్ల వాగులు పొంగి ప్రవహించగా.. పలుచోట్ల రహదారులు నీటిమయమయ్యాయి. ఖమ్మం, మధిర, సత్తుపల్లి, వైరా పట్టణాల్లో వర్షంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. జిల్లాలో వాగులు, చెరువుల్లో కూడా జలకళ సంతరించుకున్నాయి.

భద్రాద్రి జిల్లాలోనూ భారీ వర్షం

అశ్వారావుపేటలో ఇద్దరు మహిళా కూలీల గల్లంతు

భద్రాద్రి జిల్లాలోనూ శనివారం భారీ వర్షం పడింది. ఉరుములు, ఈదురుగాలలతో కూడిన వర్షం పడగా.. పలు మండలాల్లో వాగులు పొంగి ప్రవహించాయి. అశ్వాపురం మండలంలోని పెదవాగుప్రాజెక్టుకు భారీగా వరదనీరు చేరింది. ఉదయం నుంచి కురిసిన వర్షాలతో



జలమయమైన ఖమ్మం పాత బస్టాండ్

జిల్లాలోని పట్టణ ప్రాంతాల్లోని పలుప్రధాన రహదారులన్నీ జలమయమయ్యాయి. ఈ జిల్లాలో అత్యధికంగా పెంట్లంలో 8.13సెంమీ, మణుగూరులో 7.88, దమ్మపేట మండలం మల్కారంలో 6.7, అశ్వారావుపేటలో 5.48సెం.మీ వర్షపాతం నమోదవగా.. మిగిలిన మండలాల్లో 4నుంచి 1సెం.మీ. వర్షం పడింది. ఈ క్రమంలో అశ్వారావుపేట మండలంలో కావడిగుండ్ల- గోపన్నగూడెం మధ్య పెద్దవాగులో శనివారం మధ్యాహ్నం ఇద్దరు మహిళా కూలీలు గల్లంతయ్యారు. ఏపీలోని ఏలూరు జిల్లా జీలుగుమిల్లి మండలం పూచికపాడు గ్రామానికి చెందిన ఆరుగురు కూలీలు రోజూలాగే కావడిగుండ్ల, గోపన్నగూడెం మధ్యలోని పొలాల్లో వ్యవసాయ పనులకు కాలినడకన వచ్చారు. పనులు చేస్తున్న క్రమంలో వర్షం పెరగటంతో తిరిగి గ్రామానికి బయ్యాలుదేరిన వారు కావడిగుండ్ల వద్ద పెద్దవాగుకాలువ దాటుతుండగా పచ్చిశాల వరలక్ష్మీ(52), పాలడుగుల చెన్నమ్మ(50) గలంతయ్యారు. మిగిలిన నలుగురు క్షేమంగా బయటకు వచ్చారు.

ఎట్టకేలకు కొలువుదీరిన కో ఆపరేటీవ్ క్రెడిట్ సొసైటీ ఆఫీస్ బేరర్స్



కేసులాల్ ప్రకాశరావు ప్రశాంత్ రఘుకృష్ణ

ఎంపికకు సీక్రెట్ ఓటింగ్

పాల్వంచ, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కేటీపీఎస్, బీటీపీఎస్, వైటీపీఎస్ ఎంప్లాయిస్ కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ ఆఫీస్ బేరర్స్ ఎంపిక ఎట్టకేలకు శనివారం సాయంత్రం ముగిసింది. శుక్రవారమే గెలుపొందిన సభ్యులు సమావేశమై ఆఫీస్ బేరర్స్‌ను ఎన్నుకోవాల్సి ఉండగా, సభ్యుల మధ్య ఏకాభిప్రాయం కుదరకపోవడంతో శనివారం ఉదయం సమావేశం నిర్వహించారు. ఎంపిక ప్రక్రియను వీలైనంత త్వరగా ముగించాలని అధికారులు భావించినప్పటికీ సభ్యుల మధ్య సయోధ్య కుదరకపోవడంతో చివరకు అధికారులు సాయంత్రం నాలుగు ఆఫీస్ బేరర్ పోస్టులకు సీక్రెట్ ఓటింగ్ నిర్వహించారు. ఒక్కోపోస్టుకు ఇద్దరు అభ్యర్థులే పోటీపడటం విశేషం. అందులో ప్రెసిడెంట్‌గా నూనావత్ కేసూలాల్, వైస్ ప్రెసిడెంట్‌గా వల్లమల్ల ప్రకాశరావు, సెక్రెటరీగా సిద్ది ప్రశాంత్, ట్రెజరర్‌గా వీరమల్లు రఘుకృష్ణలు తమ ప్రత్యర్థులపై విజయం సాధించారు. దీంతో ఎన్నికల అధికారి గంగాధర్ విజేతలను ప్రకటించి వారికి శుభాకాంక్షలు తెలిపారు. నూతనంగా ఎన్నికకాబడిన ఆఫీస్ బేరర్స్‌లో అధ్యక్ష, ఉపాధ్యక్షులు అనుభవజ్ఞులు కావడం, సెక్రెటరీ, ట్రెజరర్లు యువకులు కావడం పట్ల కార్మికులు, ఇంజనీర్లు వారి ఎంపికపై హర్షం వ్యక్తం చేశారు.

పట్టణాల నుంచి పల్లెల వరకు డ్రగ్స్

పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షుడు రాకేష్



మాట్లాడుతున్న పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షులు రాకేష్

ఖమ్మం సంక్షేమ విభాగం, సెప్టెంబరు13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో డ్రగ్స్ మత్తు పదార్థాలు అడ్డు అదుపులో లేకుండా పట్టణాల నుంచి పల్లెల వరకు అమ్మకాలు జరుగుతున్నాయని ప్రగతిశీల యువజన కాంగ్రెస్(పీవైఎల్) రాష్ట్ర అధ్యక్షులు ఎన్‌కే రాకేష్ ఆవేదన వ్యక్తం చేశారు. హైదరాబాద్ శివార్లలోని చర్లపల్లి ప్రాంతంలో ఇటీవల రూ.12వేల కోట్ల విలువగల డ్రగ్స్ తయారీ కేంద్రం బయట పడిందని, ఇటువంటి తయారీ కేంద్రాలు అన్ని ప్రాంతాల్లో ఉన్నాయన్నారు. మత్తు పదార్థాలు నిర్మూలించటంలో ప్రభుత్వం విఫలం చెందిందని ఆరోపించారు. శనివారం ఖమ్మం రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన సంఘం జిల్లా కమిటీ సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో ఇంటిలిజెన్సీ, పోలీసు, ఎక్సైజ్‌శాఖల కళ్లుగప్పి డ్రగ్స్ వ్యాపారం జోరుగా సాగుతుందన్నారు. బహిరంగంగా అందుబాటులో ఉండటంతో యువత మత్తు పదార్థాలకు గురైతున్నారని ఆరోపించారు. రోజు రోజుకు మత్తు పదార్థాల తయారీదారులు మాఫీయాగా మారిపోతున్నారని, అధికారులను, ప్రభుత్వాన్ని శాసించే స్థాయిలోకి వెళ్లే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా అధ్యక్షులు జాటోత్ ప్రేమ్‌సింగ్, రాపోలు కృష్ణ, అశోక్, ఇస్లావత్ రమేశ్ పాల్గొన్నారు.

వదినపై మరిది అత్యాచారయత్నం!

పాల్వంచ, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : వదినపై మరిది అత్యాచారయత్నం చేసిన సంఘటన శనివారం పాల్వంచ మండలంలో జరిగింది. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఓ మహిళ భర్త మూడు నెలల క్రితం అనారోగ్యకారణాలతో మృతిచెందాడు. ఒంటరిగా ఉన్న ఆమెపై కన్నేసిన మరిది తన వదిన శనివారం పొలం పనుల్లో ఉన్న సమయంలో ఆమెపై అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. ఈ క్రమంలో మరిది నుంచి తప్పించుకుని ఆమె ఇంటికి చేరుకోగా.. అక్కడికి వచ్చిన మరిది దుర్భాషలాడుతూ భౌతికదాడికి పాల్పడ్డాడు. ఈ విషయం పెద్దమనుషులకు చెప్పినా ఫలితం లేకపోవడంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై కేసు నమోదు చేశామని రూరల్ హెచ్‌సీ హరిబాబు తెలిపారు.





పాలేరు పరిధిలోని సాగర్ ఎడమ కాలువ, జలవిద్యుత్‌కేంద్రం

పాలేరు.. సిరుల సెలయేరు..

- ఖమ్మం జిల్లా ప్రజలకు వరప్రదాయిని
- బహుళ ప్రయోజనాలందిస్తున్న జలాశయం
- లక్షలాది ఎకరాలకు సాగు నీటిని అందిస్తూ..
- లక్షల మంది గొంతులు తడుపుతున్న రిజర్వాయర్
- మత్స్యకారులకూ ఆర్థికంగా చేయూతనిస్తున్న నాటి చెరువు
- జల విద్యుత్‌కేంద్రం ద్వారా తక్కువ ఖర్చుతో కరెంట్ ఉత్పత్తి

సండే స్పెషల్ SUNDAY SPECIAL

కూసుమంచి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని పాలేరు రిజర్వాయర్ ప్రత్యేకతల గురించి తెలియనివారుండరు. నిజాం నవాబుల కాలంలో అతిపెద్ద చెరువుగా తవ్వగా.. ఆ చెరువే నేడు రిజర్వాయర్‌గా మారి ఎన్నెస్పీ రెండోజోన్‌లోని సుమారు 2.85లక్షల ఎకరాలకు కృష్ణా జలాలను అందించడమే కాకుండా.. రిజర్వాయర్, కాలువల పరిధిలో భూగర్భజలాల పెరుగడం ద్వారా మరో 3లక్షల ఎకరాల్లో పలు మెట్ట పంటలు పండుతున్నాయి. అంతేకాకుండా పాలేరు రిజర్వాయర్ చెంతన నిర్మించిన మిషన్‌భగీరథ పంప్‌హౌజ్ ద్వారా ఖమ్మం నగరంతో పాటు పలు గ్రామాలకు తాగునీరు సరఫరా అవుతోంది. ఇలా బహుళార్థ సాధక ప్రాజెక్టుగా మారిన పాలేరు జలాశయం.. మత్స్యకారులకు కూడా అండగా నిలుస్తోంది. చేపలు , టైగర్ రొయ్య పెంపకం, షికారు, విక్రయాల ద్వారా మత్స్యకారులకు ఆర్థికంగా చేయూతనిస్తోంది.

నాడు చెరువు.. నేడు రిజర్వాయర్

1922లో ఆరో నిజాం మీర్ మహబూబ్ అలీ పాలనలో చెరువుల నిర్మాణం, వ్యవసాయ విస్తరణ చర్యల్లో భాగంగా ఖమ్మం జిల్లాలో వైరా ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. అదే సమయంలో పాలేరు చెరువుపై డ్యాం నిర్మాణానికి పునాదిరాయి వేశారు. ఈ ప్రాజెక్టులకు అప్పటి ఇంజనీర్ నవాబ్ అలీ నవాబ్ జంగ్ రూపకల్పన చేయగా.. నాటి ఈ కట్టడం నేటికీ చెక్కు చెదరలేదు. సుదీర్ఘకాలంగా ఎన్నో ప్రవాహ ఒడిదుడుకులను తట్టుకుని నిలిచిన తీరు అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. నవాబ్ అలీ నేర్పు, నైపుణ్యాలకు నిలువుటద్దంగా నిలిచిన నేటి ఈ రెండో ఆధునిక దేవాలయాన్ని కేవలం సున్నం రాయిని ఉపయోగించి దీన్ని నిర్మించారు. అత్యధిక నీటి నిల్వ సామర్థ్యం ఉండేలా డ్యాంను డిజైన్ చేశారు. దీని నుంచి ఇప్పుడు ఉన్న పాత కాలువ ద్వారా సాగునీటిని అందించేవారు. 1975లో జిల్లాకు చెందిన నాటి ముఖ్యమంత్రి జలగం వెంగళరావు హయాంలో సాగర్ కాల్వను పాలేరు చెరువుకు అనుసంధానించి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌గా మార్చారు. నీటి నిల్వ సామర్థ్యం 2.5 టీఎంసీలు కాగా పూర్తిస్థాయి నీటిమట్టం 23అడుగులు. రిజర్వాయర్ నిండితే ఎలాంటి ప్రమాదం లేకుండా ప్రవాహం దానంతటదే దిగువకు వెళ్లిపోయేలా ఫాలింగ్ గేట్లు అమర్చారు. అయితే నాటి గేట్లు శిథిలం కావడంతో ఇటీవల ఆధునీకీకరణ పనుల్లో భాగంగా కొత్త ఫాలింగ్ గేట్లను ఏర్పాటు చేశారు. ఇదిలా ఉండగా.. రిజర్వాయర్ చుట్టూ కొందరు చెరువు శిఖం భూమిని ఆక్రమించుకుంటూ దున్నుకుంటుండటంతో వైశాల్యం కుంచించుకు పోతోంది.

జలవిద్యుత్ కేంద్రం ఏర్పాటు

పాలేరు రిజర్వాయర్‌కు రెండు మెగావాట్ల విద్యుదుత్పత్తి సామర్థ్యం గల కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కాలువలో నీరు ప్రవహించినంత సేపు విద్యుదుత్పత్తి జరుగుతుంది. సుమారు 25పైసల వ్యయంతోనే ఇక్కడ అతి తక్కువ ధరతో ఒక యూనిట్ విద్యుదుత్పత్తి జరుగుతుండటం విశేషం. అదేవిధంగా పాలేరును పర్యాటకకేంద్రంగా అభివృద్ధి చేశారు. దీంతో పాలేరు బహుళార్థ సాధక ప్రాజెక్టుగా విరాజిల్లుతోంది.

మత్స్య పరిశోధనా కేంద్రం

పాలేరు రిజర్వాయర్‌లో మత్స్య సంపద అధికంగా ఉన్నందున ఇక్కడ మత్స్య పరిశోధనా కేంద్రం ఏర్పాటు చేశారు. రాష్ట్రంలోనే ఇది మొదటి పరిశోధనా కేంద్రం కావడం గమనార్హం. ఇక్కడ చేపల పెంపకంపై అనేక పరిశోధనలు జరుగుతున్నాయి. తిరుపతిలోని శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయానికి అనుబంధంగా ఉండగా.. ఇక్కడి మంచినీటి రొయ్య, చేపలు మత్స్య సంపద ఇతర దేశాలకు ఎగుమతి జరుగుతోంది. అదే విధంగా చేపల షికారు ద్వారా సుమారు 1,200 మత్స్యకార కుటుంబాలు జీవిస్తున్నాయి.



లక్షల ఎకరాలకు సాగునీరు

పాలేరు రిజర్వాయర్ ద్వారా నుంచి ఖమ్మం జిల్లాతో పాటు పొరుగున ఉన్న ఏపీలోని ఎన్టీఆర్ జిల్లాలోని లక్షలాది ఎకరాలకు నాగార్జున సాగర్ నీటిని అందించేందుకు ఎడమకాలువ నిర్మాణం జరిగింది. జిల్లాలోని 16 మండలాల్లో 80 కిలోమీటర్ల మేర కాలువ సాగింది. ఆయకట్టు పరిధిలో 2.85 లక్షల ఎకరాల వరి, 3లక్షల ఎకరాల ఆరుతడి పంటలు సాగవుతున్నాయి. 119 మేజర్లు, 3,090 మైనర్లు, సబ్‌మైనర్లు, 223 బ్రాంచ్‌కెనాల్స్ ఉన్నాయి. ఎడమకాల్వతో పాటు రిజర్వాయర్‌కు అనుసంధానంగా పాతకాల్వ ఉంది. ఈ పాతకాలువ ద్వారా కూసుమంచి, నేలకొండపల్లి మండలాల్లో సుమారు 15వేల ఎకరాలకు సాగునీరందుతుంది. వీటితోపాటు పాలేరు బ్యాక్ వాటర్ ఆధారంగా భక్తరామదాసు ప్రాజెక్టు, నర్సింహులగూడెం 1, 2 దశల ద్వారా ఎత్తిపోతల పథకాల ద్వారా ఆయకట్టుకు నీరందుతుంది. భక్తరామదాసు ప్రాజెక్టు ద్వారా కూసుమంచి, తిరుమలాయపాలెం, ఖమ్మం రూరల్ మండలాల్లోని 60వేల ఎకరాలకు నీరందుతోంది. ముఖ్యంగా ఒకప్పుడు కరువు మండలంగా పేరున్న తిరుమలాయం రూపురేఖలు భక్తరామదాసుతో మారిపోయింది. ఇప్పుడు రెండు కాలాల్లో పచ్చని పంటలు పండుతుండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

దాహార్తి తీరుస్తూ..

పాలేరు రిజర్వాయర్ ప్రజల దాహార్తి తీరుస్తోంది. ఇక్కడ నిర్మితమైన మిషన్ భగీరథ ప్రాజెక్టు ద్వారా ఖమ్మంజిల్లా ప్రజలకే కాకుండా సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్ జిల్లాల ప్రజలకు తాగు నీటిని అందిస్తున్నారు. అదేవిధంగా డి ఫ్లోరైడ్ ప్రాజెక్టు ద్వారా కూసుమంచి, తిరుమలాయపాలెం మండలాలకు చెందిన 90 గ్రామాలకు రక్షిత నీరు అందుతోంది. ఎడమ కాల్వ ద్వారా ఖమ్మం మున్నేరుతో పాటు వందలాది చెరువులు నింపుతూ ప్రజలు, పశుపక్షాదుల గొంతులు తడుస్తున్నాయి.

ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ కళాశాలలో డిగ్రీ స్పాట్ అడ్మిషన్లు

- రేపు, ఎల్లుండి అవకాశం
- ప్రిన్సిపాల్ మొహ్మద్ జాకిరుల్లా

ఖమ్మంఖానాపురంహవేలి, సెప్టెంబరు13 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సరంలో చేరేందుకు సోమ, మంగళవారం స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియను నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ మొహ్మద్ జాకిరుల్లా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 17న దోస్త్‌పోర్టల్‌లో వివరాలను నమోదు చేయనున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు తమ ఒరిజనల్ సర్టిఫికెట్లతోనేరుగా కళాశాలకు రావాలని సూచించారు. ఈ చివరి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు కళాశాలలో దోస్త్ హెల్ప్ లైన్ సెంటర్ కోఆర్డినేటర్ సలీం పాషాను సంప్రదించాలని సూచించారు.

మహిళా డిగ్రీ కళాశాలలో..

ప్రభుత్వ మహిళా డిగ్రీకళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థినులకు 15,16తేదీల్లో స్పాట్ అడ్మిషన్స్ జరుగుతున్నాయని ప్రిన్సిపల్ బానోతు రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థినులు ఇంటటర్ మెమో, పదోతరగతి మెమో, కుల ధృవీకరణ పత్రం, స్టడీ ధృవీకరణ పత్రం, ఆధార్‌కార్డు, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలతో వచ్చి అడ్మిషన్స్ పొందవచ్చని తెలిపారు

జమలాపురంలో శ్రీవారికి సర్వాంగాభిషేకం

ఎర్రుపాలెం, సెప్టెంబరు13 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ తిరుపతిగా ప్రసిద్ధి గాంచిన జమలాపురం శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీవారికి శనివారం సర్వాంగాభిషేకాన్ని ఘనంగా నిర్వహించి, ముత్యాల కవచాన్ని అలంకరించారు. ఆలయ అర్చకుడు ఉప్పల శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో తెల్లవారు జామున పంచామృతాలు, సుగంధద్రవ్యాలతో సర్వాంగాభిషేకం నిర్వహించి ముత్యాల అలంకారంలో భక్తులకు దర్శనం కల్పించారు. శ్రీదేవి, భూదేవి సమేతంగా శ్రీవారి ఉత్సవాలను పల్లకీలో ఊరేగించి కల్యాణవేదిక వద్దకు చేర్చి నిత్యకల్యాణం నిర్వహించారు. భక్తులు పాలు, పొంగళ్లను శ్రీవారికి నివేదించారు. భక్తులు నూతన వాహనాలకు పూజా కార్యక్రమాలు నిర్వహించుకుని గిరి ప్రదక్షిణలు చేశారు. ఈ క్రమంలో భక్తులకు ఆలయ సిబ్బంది అన్నదానం చేయడంతో పాటు వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ ధర్మకర్త ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, సీనియర్ అసిస్టెంట్ సోమయ్య, జూనియర్ అసిస్టెంట్ ఇరుకులపాటి కృష్ణప్రసాద్, అర్చకులు రాజీవ్‌శర్మ, మురళీమోహన్‌శర్మ, దేవాలయ అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. క్షేత్రానికి భారీ సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయ పరిసరాలు సందడిగా మారాయి. ఉప ఆలయాల్లోనూ ప్రత్యేక పూజలు జరిగాయి.



శ్రీవారిని దర్శించుకున్న భక్తులు

శ్రామిక పీడిత జన స్వరం.. సురవరం

- ఆయన మృతి ప్రజా ఉద్యమాలకు తీరని లోటు
- సుధాకర్‌రెడ్డి సంతాభ సభలో కూనంనేని
- ఘన నివాళిఅర్పించిన పలువురు ఉమ్మడిజిల్లా నేతలు



సురవరం సంతాభ సభలో మాట్లాడుతున్న కూనంనేని సాంబశివరావు

ఖమ్మం ఖానాపురంహవేలి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : తన 60ఏళ్ల ప్రజా జీవితంలో సురవరం సుధాకర్‌రెడ్డి శ్రామిక, పీడిత జన స్వరమై పనిచేశారని, ఆయన మరణం ప్రజా ఉద్యమాలకు తీరనిలోటని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పేర్కొన్నారు. శనివారం ఖమ్మం భక్తరామదాసు కళాక్షేత్రంలో సీపీఐ అగ్రనేత, మాజీ ఎంపీ సురవరం సుధాకర్‌రెడ్డి సంస్మరణ సభ జరగ్గా.. ఆయన చిత్రపటానికి సీపీఐతో పాటు ఉమ్మడిజిల్లాకు చెందిన వివిధ రాజకీయ పక్షాలు, ప్రజాసంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, అభ్యుదయ వాదులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో కూనంనేని మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ప్రజా ఉద్యమ గొంతుకగా సుధాకర్ రెడ్డి పనిచేశారని ఆయన మరణం కమ్యూనిస్టు ఉద్యమానికి, పేద ప్రజలకు తీరని లోటన్నారు. సంఘటిత, అసంఘటిత రంగాల్లో ఉన్న లక్ష లాది మంది కమ్యూనిస్టు అభిమానులను ఏకతాటిపైకి తెచ్చి కార్యోన్ముఖులను చేయడమే సుధాకర్‌రెడ్డి లాంటి అమరులకు ఇచ్చే ఘనమైన నివాళి అన్నారు. వంద సంవత్సరాల కమ్యూనిస్టు ఉద్యమ ఘట్టాన్ని నేటి తరానికి వివరిస్తూ భవిష్యత్తులో బలమైన ప్రజా ఉద్యమ నిర్మాణాల కోసం డిసెంబరు 26న ఖమ్మంలో శత వసంత ముగింపు సభ నిర్వహిస్తున్నామన్నారు. లక్షలాది మందితో ఖమ్మం నగరం ఎరుపెక్కనుందని, మరో చారిత్రిక ఘట్టానికి వేదిక కానుందన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్ మాట్లాడుతూ సురవరం సుధాకర్‌రెడ్డి మరణం కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటని, విద్యార్థి దశ నుంచి తనదైన శైలిలో పోరాటాలను నడిపిన సురవరం ఎందరికో ఆదర్శంగా నిలిచారన్నారు. ఈ సభలో గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, సీపీఐ, కాంగ్రెస్, ఎన్డీ మాస్‌లైన్, సీపీఎం నేతలు, సీసీఐ ప్రతినిధులు బాగం హేమంతరావు, పువ్వాళ్ల దుర్గాప్రసాద్, ప్రముఖ వైద్యులు రవీంద్రనాథ్, గోకినేపల్లి వెంకటేశ్వరరావు, ఆవునూరి మధు, నున్నా నాగేశ్వరరావు, మహ్మద్ మౌలానా, జమ్ముల జితేందర్‌రెడ్డి, స్వర్ణ భాస్కర్, రవిమారుత్, పోట్ల మాధవరావు, డాక్టర్ వై.ప్రసాద్, వడ్డె నారాయణరావు, యర్రా బాబు, ఎస్కే జానిమియా, కొండపర్తి గోవిందరావు, సిద్దినేని కర్ణకుమార్, బీజి క్లెమెంట్, మహ్మద్ సలాం, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు పోటు కళావతి, జర్నలిస్టు సంఘాల నుంచి టీయూడబ్ల్యూజే (ఐజెయు) రాష్ట్ర కార్యదర్శి కె.రాంనారాయణ, టీయూడబ్ల్యూజే (టీజేఎఫ్) జిల్లా అధ్యక్షుడు ఆకుతోట ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.



తెలుగు కీర్తి కిరీటాలు బిరుదుతో మౌలాలిని సత్కరిస్తున్న దృశ్యం

ఉపాధ్యాయుడు మౌలాలికి సత్కారం

- తెలుగు కీర్తి కిరీటాల బిరుదు ప్రదానం

కల్లూరు, సెప్టెంబరు13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పేరువంచ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు ఎండి మౌలాలిని పలు సంస్థల ప్రతినిధులు సత్కరించారు. శనివారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లో శనివారం ఆర్ట్‌ఆఫ్ లెర్నింగ్, అభినందన ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటైన జాతీయ స్థాయి కార్యక్రమంలో మౌలాలికి అభినందన ఫౌండేషన్, ఆర్ట్‌ఆఫ్ లెర్నింగ్, మాంగల్య ఫౌండేషన్ల చైర్మన్లు అభినందన, ఎన్ రామరావు, డాక్టర్ కీర్తిలతగౌడ్‌లు ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారంతో పాటుగా తెలుగు కీర్తికిరీటాల బిరుదును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ సమాజానికి దారి చూపే, విద్యారంగంలో అంకితభావం, సృజనాత్మకత, సేవా స్ఫూర్తితో పనిచేసే వారికి మాత్రమే తెలుగు కీర్తికిరీటాలు అవార్డు అందిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా తనకు అవార్డు అందించిన ఫౌండేషన్ సంస్థల వారికి మౌలాలి కృతజ్ఞతలు తెలిపారు.

కారేపల్లి కస్తూర్బాలో హిందీ దివస్

కారేపల్లి సెప్టెంబరు(ఆంధ్రజ్యోతి): కారేపల్లి కస్తూర్బా విద్యాలయంలో శనివారం హిందీదివస్ కార్యక్రమాలను నిర్వహించారు. విద్యార్థులకు ఉపన్యాస, క్విజ్, వ్యాసరచన విభాగాల్లో పోటీలు నిర్వహించి ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందచేశారు. ఈ సందర్భంగా విద్యార్థినులు నృత్యాలు, నాటికలు, ప్రదర్శించి ఆకట్టుకున్నారు. ప్రత్యేకాధికారి ఝాన్సీ సౌజన్య మాట్లాడుతూ జాతీయభాష హిందీపై పట్టు సాధించాలని కోరారు. కార్యక్రమంలో ఎం.స్వాతి, జి. విజయమమత, మల్లెంపాటి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విలీన నష్టానికి సజీవ సాక్ష్యం ఇది..

(5వ పేజీ తరువాయి)

ఎక్కడ లోకల్ అనే శీర్షికన 'ఆంధ్రజ్యోతి' ప్రధాన సంచికలో శనివారం ప్రచురితమైన కథనం రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఈ విషయంపై భద్రాచలం పట్టణవాసులతో పాటు ఉమ్మడి జిల్లా, ఇతర జిల్లాల్లోనూ నీట్ విద్యార్థినికి ఎదురైన కష్టం గురించి చర్చించుకుంటున్నారు. ఇదిలా ఉండగా ఈ విషయంపై ప్రభుత్వం వెంటనే స్పందించి న్యాయం చేయాలని మరోసారి రితిక తండ్రి అశోక్‌కుమార్, విద్యార్థిని సాయి రితిక ప్రభుత్వాన్ని కోరారు. కాగా భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావును కూడా శనివారం మరోసారి కలిసిన వారు ప్రభుత్వం సానుకూలంగా స్పందించేలా చూడాలని అభ్యర్థించారు. ఈ విషయంపై సీఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డికి వివరించానని ఎమ్మెల్యే వారికి తెలిపారు.

నిజాం పాలనలో వెట్టిచాకిరీ నుంచి .. విముక్తి కల్పించిన చరిత్ర కమ్యూనిస్టులది

- 17న ఖమ్మంలో రైతాంగ పోరాట వారోత్సవాల ముగింపు సభ
- సీపీఎం ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు



సమావేశంలో మాట్లాడుతున్న నున్నా నాగేశ్వరరావు

కొణిజర్ల, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): నిజాం సర్కారుపై వెట్టిచాకిరీ నుంచి తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం ద్వారా విముక్తి కల్పించిన చరిత్ర కమ్యూనిస్టులదని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు తెలిపారు. శనివారం కొణిజర్ల సీపీఎం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజాపోరాటాల చరిత్రను బీజేపీ వక్రీకరించి మతాల మధ్య చిచ్చుపెట్టే ప్రయత్నం చేయడం దుర్మార్గమన్నారు. నాటి ఉద్యమంలో 4వేల మంది కమ్యూనిస్టులు బలిదానమయ్యారని గుర్తుచేశారు. సాయుధ పోరాటంలో ఖమ్మంజిల్లా కీలకపాత్ర పోషించిందని తెలిపారు. చరిత్రను గుర్తుచేస్తూ సీపీఎంజిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 17న భక్తరామదాసు కళాక్షేత్రంలో తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాల ముగింపు సభను విజయవంతం చేయాలన్నారు. ఈ సభకు సీపీఎం అఖిలభారత ప్రధాన కార్యదర్శి ఎంఏ బేబీ, కేంద్ర కమిటీసభ్యుడు తమ్మినేని వీరభద్రం హాజరవుతారన్నారు. ఈ సమావేశంలో సీపీఎం వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం, నాయకులు దొడ్డపనేని కృష్ణార్జునరావు, తాళ్లపల్లి కృష్ణ, పార్టీ మండల కార్యదర్శి చెరుకుపల్లి కుటుంబరావు, నాయకులు కొప్పుల కృష్ణయ్య, తాతా పద్మ, బోయినపల్లి శ్రీనివాసరావు, చింతపల్లి ప్రసాద్, లింగాల దానయ్య, చింతనిప్పు నరసింహారావు, హరిచంద్, విజయ, వీరభద్రం, అప్జల్, రాములు, గోపయ్య, రామారావు తదితరులు పాల్గొన్నారు.



కష్టపడి పనిచేసే కార్యకర్తలే మా బలం

బీఆర్ఎస్ మధిర నియోజకవర్గ ఇన్‌చార్జ్ లింగాల కమల్‌రాజు

చింతకాని, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): తమ పార్టీకి కష్టపడి పనిచేసే కార్యకర్తలే బలమని, తమ నాయకుల వద్దకు బ్రోకర్లను పంపి పార్టీ మారాలని ఒత్తిడి తెస్తూ భట్టి చిల్లర రాజకీయాలు చేస్తున్నాడని బీఆర్ఎస్ మధిర నియోజకవర్గ ఇన్‌చార్జ్, జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు అన్నారు. శనివారం చింతకానిలో జరిగిన మండల ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మట్లాడారు. కమీషన్ల ద్వారా వచ్చే డబ్బులతో భట్టి బీఆర్ఎస్ నాయకులను కొనేందుకు ప్రయత్నిస్తున్నాడన్నారు. పోలీసులు, అధికారులను ఉసిగొల్పి భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. పెంట్యాల పుల్లయ్య ఒక్కడే తమ పార్టీని వీడుతున్నాడని, ఇంకెవరూ బీఆర్ఎస్‌ను వీడటంలేదన్నారు. వచ్చే పంచాయతీ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపు ఖాయమన్నారు.

ఇసుక లారీ, ఎక్స్‌కవేటర్ సీజ్

అశ్వాపురం సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని జగ్గారం గ్రామం నుంచి ఇల్లెందుకు ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న లారీ, ఇసుకను లోడ్ చేసిన ఎక్స్‌కవేటర్‌ను శనివారం అశ్వాపురం పోలీసులు సీజ్‌చేశారు. జగ్గారంలో అక్రమంగా నిల్వఉంచిన ఇసుకను కొందరు వ్యక్తులు లారీల ద్వారా బయటకు తరలిస్తున్నారన్న సమాచారంతో సీఐ అశోక్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు నిఘా పెట్టి ఆ వాహనాలను పట్టుకున్నారు. ఈ క్రమంలో ఇసుకతరలిస్తున్న మంచికంటినగర్‌కు చెందిన ఊకే సతీష్, ఇల్లెందుకు చెందిన లారీ డ్రైవర్ భూక్యా జానీ, అశ్వాపురానికి చెందిన ఎక్స్‌కవేటర్ ఓనర్ పర్సారి రాకేష్‌పై కేసునమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ఇక జగ్గారంలో నిల్వ ఉంచిన ఇసుకను సీజ్‌చేసి గ్రామపంచాయతీకి అప్పగించినట్లు తహసీల్దార్ మణిధర్ తెలిపారు.

గడ్డి మందు తాగిన యువకుడు చికిత్స పొందుతూ మృతి

ఖమ్మంక్రైం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): గడ్డి మందు తాగిన ఓ యువకుడు చికిత్స పొందుతూ మృతిచెందిన సంఘటనపై శనివారం రాత్రి త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసునమోదైంది. నేలకొండపల్లి మండలం బుద్దారం గ్రామనికి చెందిన పాశం బ్రహ్మారెడ్డి(28) నగరంలో ఓ ఆసుపత్రిలో కాంపౌండర్‌గా పనిచేస్తున్నాడు. కొంతకాలంగా మద్యానికి బానిసవడంతో అతడిని తల్లి మందలించింది. దీంతో ఈ నెల 9న ప్రకాశ్‌నగర్ మున్నేరు వద్ద గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. గమనించిన స్థానికులు నగరంలోని ఓ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడి తల్లి లక్ష్మి ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు.


రామాలయంలో పూజలు చేస్తున్న నందిని

రామాలయ అభివృద్ధికి సహకరిస్తా

మధిర,సెప్టెంబరు13(ఆంధ్రజ్యోతి): మధిర రైల్వే స్టేషన్‌లోని కోదండ రామాలయ అభివృద్ధికి తన వంతుగా సహాయ సహకారాలు అందించడానికి సిద్ధంగా ఉన్నట్టు అమ్మ ఫౌండేషన్ చైర్మన్, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సతీమణి మల్లు నందిని అన్నారు. శనివారం రైల్వే స్టేషన్ రామాలయంలో ఆమె కాంగ్రెస్ నాయకులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించి.. ఆ తర్వాత మాట్లాడారు. రైల్వే స్టేషన్ ఆధునికీకరణ పనులు జరుగుతున్నాయన్నారు. నూతన బస్టాండ్ నిర్మాణ పనులు త్వరలో ప్రారంభం కానున్నాయన్నారు. ట్యాంక్‌బండ్ విస్తరణ పనులు కూడా జరగనున్నాయని, వీటన్నింటికీ సమీపంలో ఉన్న రామాలయం అభివృద్ధి చేస్తే బాగుంటుందని అన్నారు. దీనికి అవసరమైన ఎలాంటి సహాయ సహకారాలను అందించడానికి తాను సిద్ధంగా ఉన్నానని నిర్వాహకులకు హామీ ఇచ్చారు. రామాలయ అభివృద్ధి ప్లాన్‌ను పరిశీలించి తగు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మల్లాది వాసు, రంగా హనుమంతరావు, పారుపల్లి విజయ్, యన్నం కోటేశ్వరరావు, కర్నాటి రామారావు, మల్లాది సవిత, కోన సుచరిత పాల్గొన్నారు.


సమావేశంలో అభివాదం చేస్తున్న బంజారా సంఘ నాయకులు

లంబాడీల ఆత్మగౌరవాన్ని దెబ్బతీయొద్దు

● బంజారా సంఘ జేఏసీ నాయకులు

జూలూరుపాడు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలంటూ.. లంబాడీల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా కొంతమంది ఎమ్మెల్యేలు, ఆదివాసీ సంఘం నాయకులు అసత్య ఆరోపణలు చేస్తున్నారని బంజారా సంఘం జేఏసీ నాయకులు శంకర్‌నాయక్, రాజేష్ నాయక్, కేశ్యానాయక్‌లు అన్నారు. శనివారం జూలూరుపాడులో బంజారా సంఘం జేఏసీ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. సుప్రీంకోర్టులో లంబాడీలకు వ్యతిరేకంగా దాఖలైన కేసును నిరసిస్తూ ఆదివారం భద్రాద్రి కొత్తగూడెంలో లంబాడీల ఆత్మగౌరవ సభ ర్యాలీని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ర్యాలీలో అధికసంఖ్యలో బంజారాలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. లంబాడీలు రాజ్యాంగబద్ధంగా షెడ్యూల్ తెగలుగా గుర్తించబడ్డారన్నారు. అయినప్పటికీ కొంతమంది ఎమ్మెల్యేలు, ఆదివాసీ సంఘం నాయకులు గిరిజన తెగల మధ్య ఘర్షణ వాతావరణాన్ని సృష్టించి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారన్నారు. ఈ సమావేశంలో జేఏసీ నాయకులు కాన్షిరాం, గుగులోత్ నాగేశ్వరరావు, లక్ష్మణ్ నాయక్, నరసింహానాయక్ తదితరులు పాల్గొన్నారు.


ఎన్నికల కమిషనర్‌కు స్వాగతం పలుకుతున్న కలెక్టర్

జిల్లాకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాక

● స్వాగతం పలికిన భద్రాద్రి కలెక్టర్ జితేష్

లక్ష్మీదేవిపల్లి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కముదిని శనివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పర్యటనకు వచ్చారు. జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ లక్ష్మీదేవిపల్లిలోని సింగరేణి అతిథి గృహంలో ఆమెను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. జిల్లాలో త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికలపై చర్చించినట్లు సమాచారం. కమిషనర్‌కు స్వాగతం పలికిన వారిలో లక్ష్మీదేవిపల్లి ఎంపీడీవో అంకుబాబు ఇతర సిబ్బంది ఉన్నారు.


కాంగ్రెస్‌లో చేరిన చేగర్శల గ్రామానికి చెందిన కుటుంబాలు

'స్థానికం'లోనూ కాంగ్రెస్ జెండా ఎగరాలి

● పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

పినపాక, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేసేలా ప్రతీ ఒక్క కార్యకర్త కృషి చేయాలని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం చేగర్శల గ్రామంలో జరిగిన సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా స్థానికంగా ఉన్న శ్రీకృష్ణ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జరిగిన సమావేశంలో చేగర్శల గ్రామపంచాయతీలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన 110 కుటుంబాలు.. ఆ పార్టీని వీడి ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలోకి చేరాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం మాట్లాడుతూ.. పినపాక మండలం కాంగ్రెస్ పార్టీకి కంచుకోటన్నారు. బీఆర్ఎస్ పార్టీ రాష్ట్రంలో దోపిడీ చేసిన సొమ్ముతో కల్వకుంట్ల కుటుంబం కకావికలమవుతుందన్నారు. కేసీఆర్ కూతురు కవిత, తన అన్న కేటీఆర్, బావ హరీష్‌రావు, సంతోష్‌రావులు పదేళ్ల పాలనలో దోచుకుతిన్నారన్నారు. కాళేశ్వరం ఓ పెద్ద కుంభకోణమని ఆరోపించడంతోనే బీఆర్ఎస్ నేతల అవినీతి బాగోతం తేటతెల్లమవుతుందన్నారు. కాగా.. రెండు రోజుల క్రితం దుగినేపల్లి పంచాయతీలో 80 కుటుంబాలు బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరగా, తాజాగా చేగర్శల గ్రామం నుంచి బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరడంతో చేరికల పర్వం ఊపందుకుంది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు గొడిశాల రామనాధం, మాజీ వైస్ ఎంపీపీ కంది సుబ్బారెడ్డి, నాయకులు పేరం వెంకటేశ్వరరావు, కొర్సా ఆనంద్, గంగిరెడ్డి వెంకటరెడ్డి, శ్రీనివాసరెడ్డి, దాట్ల రాజేష్, లక్ష్మీరెడ్డి, బోడ రమేష్, బిల్లం సాంబశివరావు, కేత ప్రసాద్, సుంకరి వెంకటరమణ, భవతి, కుమారస్వామి, చీమల రాజు పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనోత్పత్తికి శ్రీకారం

» జిల్లాలోని సహకార సంఘాల ద్వారా కార్యక్రమం

» కార్యాచరణ సిద్ధం చేసిన కృషి విజ్ఞాన కేంద్రం నిర్వాహకులు

కొత్తగూడెం అర్బన్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): అన్నదాతల సాగుకు అవసరమయ్యే విత్తనాలు జిల్లాలో లభించడం లేదు. ఫలితంగా విత్తన ఉత్పత్తి కార్యక్రమం ప్రైవేట్ డీలర్లకు మూడు పువ్వులు.. ఆరు కాయలుగా విరాజిల్లుతోంది. ఫౌండేషన్ విత్తనాలు రైతాంగానికి అందుబాటులో లేకపోవడంతో వారు సర్టిఫైడ్ విత్తన ఉత్పత్తికి చేసుకోకలేకపోతున్నారు. ప్రైవేట్ కంపెనీలు, దళారులు ఇచ్చినప్పటికీ.. తిరిగి ఒప్పందంలో భాగంగా రైతులు పండించిన పంటలను వారికే ఇవ్వాల్సి ఉంటుంది. దీని నుంచి శాశ్వత పరిష్కారం కోసం వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక చొరవతో రాష్ట్ర ప్రభుత్వం సహకార సంఘాల ద్వారా నాణ్యమైన విత్తన ఉత్పత్తి కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ బృహత్తరమైన కార్యక్రమంతో రైతులు తాము పండించే పంటలకు సరిపడా నాణ్యమైన విత్తనాలను తాము తయారు చేసుకునే వెసులుబాటు లభించింది. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ విశ్వవిద్యాలయం, రాష్ట్ర వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని అన్ని మండలాల్లో ఎంపిక చేసిన గ్రామాలకు చెందిన రైతులను ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం చేసి విత్తన ఉత్పత్తి కార్యక్రమం చేపట్టింది. జిల్లాలో వరి, పత్తి, కంది, సోయబీన్, పచ్చిరొట్ట, వేరుశనగ విత్తనాల ఉత్పత్తికి రైతులను ఎంపిక చేసి విత్తనాలను పంపిణీ చేసే కార్యక్రమం ప్రారంభమైంది.


కొత్తగూడెంలో రైతుకు విత్తన నాణ్యతను వివరిస్తున్న దృశ్యం

జిల్లాలోని సహకార సంఘాల నుంచి ఎంపిక చేసిన రైతులకు ఈ విత్తనాలను అందించి ఉత్పత్తి చేసేందుకు కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) నిర్వాహకులు కార్యాచరణ సిద్ధం చేశారు. జిల్లాలోని రైతు ఉత్పత్తి సంఘాలుగా మారిన పీఏసీఎస్‌లను ఎంపిక చేసి వాటి సభ్యులైన రైతుల ద్వారా విత్తన ఉత్పత్తి చేస్తున్నారు. ఈ కార్యక్రమం విజయవంతమైతే మిగిలిన సహకార సంఘాల రైతులకు విస్తరించనున్నారు. ఉత్పత్తి చేసిన సర్టిఫైడ్ విత్తనాలను మిగిలిన సహకార సంఘాలకు విక్రయించనున్నారు. యాసంగి సాగుకు ఫౌండేషన్ విత్తనాలను కర్షకులకు అందించనున్నారు.

జిల్లాలో సాధారణ సాగుకు సంబంధించి ప్రతీ సంవత్సరం విత్తన అవసరాలు గణనీయంగా పెరుగుతున్నాయి. కానీ రైతులకు సరిపడా నాణ్యమైన విత్తన ఉత్పత్తి మాత్రం ఉండడం లేదు. సహకార సంఘాల రైతుల ద్వారా విత్తన ఉత్పత్తి విధానం సఫలీకృతమైతే.. కొంతమేర విత్తన కొరత తీరే అవకాశం ఉంది. జిల్లాలో వరి డబ్ల్యూజియల్ 1537, డబ్ల్యూజియల్ 44, పెసర ఎంజి జి-295 రకానికి చెందిన 800విత్తన కిట్లను రైతులకు కృషి విజ్ఞాన కేంద్రం కో ఆర్డినేటర్ డాక్టర్. టి. భరత్, శాస్త్రవేత్తలు ఎన్. హేమ, శరత్‌చంద్ర, బి. శివల ఆధ్వర్యంలో అందించారు. జిల్లాలోని ఆళ్లపల్లిలో మర్కోడ్, ఆళ్లపల్లి క్లస్టర్లు, అన్నపురెడ్డిపల్లిలో అన్నపురెడ్డిపల్లి, పెద్దిరెడ్డిగూడెం క్లస్టర్లు, అశ్వాపురంలో అశ్వాపురం, తుమ్మలచెరువు, మొండికుంట క్లస్టర్లు, అశ్వారావుపేటలో అశ్వారావుపేట, అనంతారం, నారాయణపురం, తిరుమలకుంట క్లస్టర్లు, భద్రాచలంలో భద్రాచలం క్లస్టర్, బూర్గంపాడులో బూర్గంపాడు, మొరంపల్లిబంజర, సారపాక క్లస్టర్లు, చంద్రుగొండలో గానుగపాడు, చంద్రుగొండ, పొకలగూడెం క్లస్టర్లు, చర్లలో చర్ల, సత్యనారాయణపురం, తేగడ క్లస్టర్లు, చుంచుపల్లిలో చుంచుపల్లి క్లస్టరు, దమ్మపేటలో పట్వారిగూడెం, నాగుపల్లి, మైలారం క్లస్టర్లు, దుమ్ముగూడెంలో దుమ్ముగూడెం, నర్సాపురం, పర్ణశాల, మారాయిగూడెం, ఆర్లగూడెం క్లస్టర్లు, గుండాలలో గుండాల కాచనపల్లి క్లస్టర్లు, జూలురుపాడులో పాపకొల్లు, మాచినేనిపేట, జూలురుపాడు, కాకర్ల క్లస్టర్లు, కరకగూడెంలో ఆనంతారం, కరకగూడెం క్లస్టర్లు, కొత్తగూడెంలో కొత్తగూడెం క్లస్టర్లు ఉన్నాయి. అలాగే లక్ష్మీదేవిపల్లిలో కారుకొండ, బంగారుచెలక, లక్ష్మీదేవిపల్లి క్లస్టర్లు, మణుగూరులో మణుగూరు, రామనుజవరం క్లస్టర్లు, ములకలపల్లిలో జగన్నాధపురం, ములకలపల్లి, పూసుగూడెం, పొగళ్లపల్లి క్లస్టర్లు, పాల్వంచలో పాల్వంచ, ఉల్వనూరు, యానంబైల్, జగన్నాధపురం క్లస్టర్లు, పినపాకలో జానంపేట, పినపాక, ఈ- బయ్యారం క్లస్టర్లు, సుజాతనగర్‌లో సీతంపేట, సింగభూపాలెం, సుజాతనగర్ క్లస్టర్లు, టేకులపల్లిలో గొల్లపల్లి, కోయగూడెం, టేకులపల్లి, బోడు, గంగారం క్లస్టర్లకు చెందిన మొత్తం 800 కిట్లను 800మంది రైతులకు నాణ్యమైన విత్తనాలను విత్తనోత్పత్తికి అందించామని కృషి విజ్ఞాన కేంద్రం కో ఆర్డినేటర్ డాక్టర్ టి. భరత్ తెలిపారు.


రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

మొండికుంట వద్ద రైతుల రాస్తారోకో

» తుమ్మలచెరువు షెట్టర్లకు మరమ్మతులు చేపట్టాలని ఆందోళన

అశ్వాపురం, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి) : మండలంలోని తుమ్మలచెరువు షట్టర్లను వెంటనే తెరిపించి మరమ్మతులు నిర్వహించాలని కోరుతూ శనివారం ఆయకట్టు రైతులు రోడ్డెక్కారు. మణుగూరు-కొత్తగూడెం జాతీయ రహదారిపై మొండికుంట వద్ద బైఠాయించారు. ఇరిగేషన్ అధికారులు వెంటనే సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది. కాగా తుమ్మలచెరువు రెండుషెట్టర్లు మరమ్మతులకు గురై గత 20 రోజులుగా ఆయకట్టుకు నీటివిడుదల జరగకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందారు. తుమ్మలచెరువు సామర్థ్యం 23 అడుగులు కాగా.. ప్రస్తుతం 21 అడుగులకు చేరుకోవడంతో షెట్టర్ మరమ్మతులకు వీలు కావడం లేదని, అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు పేర్కొంటున్నారు. దీంతో జిల్లా కలెక్టర్, ఇరిగేషన్ ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. కలెక్టర్ ఆదేశాల మేరకు గజ ఈతగాళ్ల సహాయంతో రెండు రోజుల క్రితం తూములు తెరిచేందుకు అధికారులు ప్రయత్నించినా.. ఫలితం లేకపోవడంతో అధికారులు చేతులెత్తేశారు. దీంతో ఆగ్రహించిన రైతులు తమ పంటలను కాపాడాలని రాస్తారోకోకు దిగారు. విషయం తెలుసుకున్న సీఐ అశోక్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని రైతులకు సర్దిచెప్పారు. ఉన్నతాధికారులతో మాట్లాడి రాస్తారోకోను విరమింపజేశారు. ఆ తర్వాత ఇరిగేషన్ ఈఈ నర్సింహారావు, డీఈ రమేష్‌లు తుమ్మలచెరువు వద్దకు చేరుకుని షెట్టర్లు తెరిపించే ప్రయత్నం చేశారు.

ఫలించిన మెకానిక్ కృషి

తుమ్మలచెరువు షెట్టర్లు తెరిపించడం కోసం ఇరిగేషన్ అధికారులు శనివారం తీవ్రంగా ప్రయత్నించినా.. ఫలితం లేకపోవడంతో అంతా చేతులెత్తేశారు. ఈ తరుణంలో రైతులు పట్టువదలకుండా తూమును తెరిచేందుకు విశ్వ ప్రయత్నాలు చేశారు. ఈ సందర్భంగా రామచంద్రాపురం గ్రామానికి చెందిన మెకానిక్ కొమ్ముమల్లయ్య.. చైన్ బ్లాక్ ద్వారా తన చతురతతో రైతుల సహాయంతో ప్రధాన తూముషెట్టరును కదిలించడంతో ఎట్టకేలకు నీరు విడుదలైంది. దీంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ సందర్భంగా మల్లయ్యను ఇరిగేషన్ డీఈ రమేష్, రైతులు అభినందించారు.


రాస్తారోకో చేస్తున్న ఆయకట్టు రైతులు


మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

కేటీఆర్‌కు అవార్డు దక్కడంపై హర్షం

దుమ్ముగూడెం సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఐటీ శాఖ మాజీ మంత్రి కేటీఆర్‌కు అమెరికా దేశ ప్రతిష్ఠాత్మక గ్రీన్ లీడర్ షిప్ అవార్డు రాష్ట్ర దక్కడం బీఆర్ఎస్ పార్టీకి గర్వకారణమని పలువురు పార్టీ నాయకులు కొనియాడారు. శనివారం లక్ష్మీనగరం బీఆర్ఎస్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. సుస్థిర పాలన, పర్యావరణ పరిరక్షణలో కేటీఆర్ కృషికి ఈ అవార్డు దక్కిందన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ కన్వీనర్, కో-కన్వీనర్లు కణితి రాముడు, జానీ పాషా, కొత్త మల్లేశ్వరావు, వాగె వెంకటేశ్వరావు, దామెర్ల శ్రీనివాసు, సరియం సీతారాం తదితరులు పాల్గొన్నారు.



దేవీ నవరాత్రులకు
సిద్ధంగా అమ్మవారి ప్రతిమలు

» భారీగా పెరిగిన ధరలు

ఖమ్మంఖానాపురంహవేలి, సెప్టెంబర్ 13(ఆంధ్రజ్యోతి) : ఈ నెల 22 నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు నిర్వహించే దేవీ నవరాత్రులకు సంబంధించి అమ్మవారి విగ్రహాలు నగరంలో విక్రయానికి సిద్ధంగా ఉన్నాయి. పలువురు విక్రయదారులు ఖమ్మం నగరంలోని పలు ప్రాంతాలలో ప్రతిమలను సిద్ధంగా ఉంచారు. జిలా కేంద్రంలోని రోటరీనగర్, ఇందిరానగర్, బైపాస్‌రోడ్, వరంగల్ క్రాస్ రోడ్, కోదాడ క్రాస్ రోడ్, ఇల్లెందు రోడ్ తదితర ప్రాంతాలలో అమ్మవారి ప్రతిమలను విక్రయిస్తున్నారు. 2 అడుగుల నుంచి 16 అడుగుల వరకు వివిధ ఆకారాలు, రంగులలో ప్రతిమలు అందుబాటులో ఉన్నాయి. రూ. 2వేల నుంచి రూ. 65 వేల వరకు లభిస్తున్నాయి. ప్రతి ఏటా అమ్మవారి విగ్రహాలను మహారాష్ట్రలోని నాందేడ్‌తో పాటు హైదరాబాద్, బెంగుళూరు, విజయవాడ తదితర ప్రాంతాల నుంచి ఖమ్మం నగరంలోని పలు ప్రాంతాలకు తీసుకొచ్చి వ్యాపారులు విక్రయిస్తుంటారు. అయితే గత ఏడాదితో పోల్చితే ఈ యేడు ధరలు అధికంగా ఉన్నాయని పలు మండపాల నిర్వాహకులు వాపోతున్నారు.


విక్రయానికి సిద్ధంగా ఉన్న అమ్మవారి ప్రతిమలు



ఉమ్మడి జిల్లాలో రూ. 300కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు

● రేపటి నుంచి నిరసన కార్యక్రమాలు ● ఉన్నత విద్యాసంస్థల యాజమాన్యాల ప్రకటన

ఖమ్మంఖానాపురంహవేలి, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని డిగ్రీ, పీజీ, ఫార్మసీ, బీఈడీ, ఎంబీఏ, ఎంసీఏ, ఇంజనీరింగ్ విద్యాసంస్థలకు రూ. 300 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఉన్నాయని విద్యా సంస్థల యాజమాన్యాలు తెలిపాయి. గత మూడేళ్లుగా ఫీజు బకాయిలు రాకపోవడంతో కళాశాలలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాయన్నారు. దీంతో కళాశాలలోని బోధన, బోధనేతర సిబ్బందికి జీతాలు ఇచ్చే పరిస్థితి లేకుండా పోయిందని విద్యా సంస్థల అధిపతులు వాపోయారు. రాష్ట్ర ఐక్య కార్యాచరణ కమిటీ పిలుపు మేరకు శనివారం నగరంలోని యస్‌బీఐటీ. కళాశాలలో జిల్లా ఇంజనీరింగ్ విద్యా సంస్థల యాజమాన్యాల అధ్యక్షుడు చలసాని సాంబశివరావు అధ్యక్షతన ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన విద్యాసంస్థల యాజమాన్యాలు, విద్యార్థి సంఘాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చలసాని సాంబశివరావు మాట్లాడుతూ.. ఫీజు రీయింబర్స్‌మెంట్ సమస్య అనేది విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు సంబంధించినదన్నారు. యాజమాన్యాలకు సంబంధించినది కాదన్నారు. ప్రభుత్వ నిర్ణయాల వల్ల కళాశాలను నడపడం కష్టతరంగా మారిందని అన్నారు. గత ప్రభుత్వంలో ఇబ్బందులు పడ్డామన్నారు. కొత్త ప్రభుత్వమైనా విద్యా సంస్థల సమస్యలను పరిష్కరిస్తుందని అనుకున్నామని.. కానీ ఆ పరిస్థితి లేదన్నారు. జిల్లాలో ఓ ఉప ముఖ్యమంత్రి, ఇద్దరు ప్రధాన శాఖల మంత్రులు ఉన్నప్పటికీ.. విద్యా సంస్థలకు రావాల్సిన బకాయిలను ఇప్పించడంలో సహాయ సహకారాలు అందించడం లేదన్నారు. కనీసం ముఖ్యమంత్రిని కలిసి పరిస్థితిని వివరించే పరిస్థితి లేకుండా పోయిందన్నారు. ఇందుకు నిరసనగా సోమవారం మధ్యాహ్నం ఖమ్మంలోని అన్ని విద్యాసంస్థల విద్యార్థులు విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ సెంటర్‌లో గల అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపడుతున్నట్టు చెప్పారు. అలాగే మంగళవారం ధర్నాచౌక్‌లో యాజమాన్య సంఘాలు, అధ్యాపకులు నిరాహార దీక్షను చేపట్టి తదుపరి కార్యక్రమాన్ని ప్రకటిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో యస్.బి.ఐ.టి. కృష్ణ, విజయ కాలేజి ఉషాకిరణ్, శ్రీ చైతన్య శ్రీధర్, ప్రియదర్శిని నవీన్, మ్యాక్స్ కాలేజీ సత్యనారాయణ, డిగ్రీ కళాశాలల బాధ్యులు ప్రభాకర్ రెడ్డి , ఇతర విద్యాసంస్థల యాజమాన్యాలు, విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న విద్యా సంస్థల అధిపతులు

బ్లాస్టింగులతో నష్టపోయిన ఇళ్లకు మరమ్మతులు చేయించాలి

సత్తుపల్లిరూరల్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): సింగరేణి పరివాహక ప్రాంతాలలో బాంబ్ బ్లాస్టింగులకు నష్టపోయిన ఇళ్లకు మరమ్మతులు చేయించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు దండు ఆదినారాయణ డిమాండ్ చేశారు. బాధితులతో కలిసి స్థానిక జేవీఆర్ ఓసీకి చేరుకుని పీవో ఎస్‌వీఎస్.ప్రహ్లాద్‌కు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. బాంబుల తీవ్రతకు ఇళ్లకు పగుళ్లు వచ్చాయన్నారు. రేకులు పగిలిపోయి వర్షాలకు కురుస్తున్నాయని, గతంలో రిపేర్ వర్క్ చేసినప్పటికీ మళ్లీ కురుస్తున్నాయన్నారు. ఎప్పుడు కూలుతాయోనంటూ బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్న ఆ కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాజశేఖర్, పాలకుర్తి వీరయ్య, మాతిపోగు సీమోను, రమేష్, మందా నాగరాజ్, తాళ్లూరు రమేష్, మాణిక్యం, తులసి, సూరయ్య, సత్యవతి, అరుణ, రమాదేవి, వెంకటేశ్వరరావు, రాంబాబు, రాజు, ప్రసాద్ పాల్గొన్నారు.


పీవోకు వినతిపత్రం అందిస్తున్న బాధితులు


కల్లూరులో పోలీసు బందోబస్తు మధ్య రైతులకు కూపన్ల పంపిణీ

యూరియా కోసం
మహిళా రైతుల పడిగాపులు

పోలీసు బందోబస్తు మధ్య కూపన్ల పంపిణీ

కల్లూరు, సెప్టెంబరు13 (ఆంధ్రజ్యోతి) : యూరియా కోసం మండలంలోని పలు గ్రామాల్లో గల సహకార సంఘాల కార్యాలయాల ఎదుట శనివారం రైతులు పడిగాపులు కాశారు. కల్లూరు సొసైటీ కార్యాలయం వద్దకు మాత్రం తెల్లవారు జామునుంచే మహిళా రైతులు క్యూలో నిలబడేందుకు గేట్ల వద్ద నిరీక్షించారు. కూపన్ల కోసం గంటల తరబడి నిరీక్షించారు. కల్లూరు పీఏసీఎస్‌కు శనివారం 30 టన్నుల యూరియా పంపిణీకి 700 కూపన్లను రైతులకు అందించారు. అలాగే పోచారం సొసైటీకి 20 టన్నులు, చిన్నకోరుకొండికి 20 టన్నులు, కొర్లగూడెం సొసైటీకి మరో 20 టన్నులు రాగా.. రైతులకు పంపిణీ చేసినట్టు ఏవో రూప 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. కల్లూరు ఎస్సై హరిత పర్యవేక్షణలో కల్లూరు, పెనుబల్లి పోలీసుల పహారా మధ్య రైతులు ఎలాంటి తోపులాటకు పాల్పడకుండా కూపన్ల పంపిణీ కార్యక్రమం సవ్యంగా జరిగింది.

తిమ్మరావుపేటలో యూరియా పంపిణీ కేంద్రం

ఏన్కూరు, సెప్టెంబరు13(ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మరావుపేటలో యూరియా పంపిణీ కేంద్రం ఏర్పాటు చేశారు. శనివారం నుంచి ఇక్కడ రైతులకు యూరియా పంపిణీ చేస్తున్నారు. ఇప్పటి వరకు ఏన్కూరు సొసైటీ కార్యాలయంలో యూరియా పంపిణీ జరుగుతుంది. మండల వ్యాప్తంగా రైతులు ఇక్కడకు వస్తుండడంతో పంపిణీలో గందరగోళం ఏర్పడుతుంది. దీంతో తిమ్మరావుపేటలో పంపిణీ కేంద్రం ఏర్పాటు చేశారు. నాచారంలో కూడా యూరియా పంపిణీ కేంద్రం ఏర్పాటు చేసినట్టయితే రైతులకు ఉపయోగకరంగా ఉంటుందని భావిస్తున్నారు. పోలీసు బందోబస్తు మధ్య యూరియా పంపిణీ చేస్తున్నారు.



పెండింగ్ వేతనాలు ఇవ్వాలి

అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల నిరసన

ఖమ్మంసంక్షేమవిభాగం, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): గిరిజన పోస్ట్‌మెట్రిక్ వసతిగృహాల్లో విధులు నిర్వహిస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు పెండింగ్ వేతనాలను తక్షణమే ఇవ్వాలని ఉద్యోగులు నిర్వహిస్తున్న సమ్మె శనివారం రెండో రోజుకు చేరింది. ఈసందర్భంగా టీయూసీఐ, ఏఐటీయూసీ నాయకులు మద్దతు పలికారు. సమ్మె చేస్తున్న ఉద్యోగులతో కలిసి రామాలయం సెంటర్ నుంచి గిరిజన వసతిగృహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీయూసీఐ జిల్లా కార్యదర్శి జీ రామయ్య, నాయకులు సీతామహాలక్ష్మీ, కే.శ్రీనివాస్, ఆజాద్, ఝాన్సీ, రాకేష్, భరత్ పాల్గొన్నారు.

రైతులకు యూరియా అందించాలి: సీపీఎం



కూసుమంచి, సెప్టెంబరు13 (ఆంధ్రజ్యోతి): యూరియాకోసం రైతులు పడుతున్న ఇబ్బందులను వెంటనే తొలగించాలని, రైతులకు సరిపడా యూరియాను తక్షణమే అందించాలని సీపీఎం పాలేరు డివిజన్ కార్యదర్శి బండి రమేష్ డిమాండ్ చేశారు. సీపీఎం, తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఖాళీ యూరియా బస్తాలతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. అనంతరం బండి రమేష్ మాట్లాడుతూ రైతులు నాట్లు వేసిన దగ్గర నుంచి యూరియా కష్టాలు ప్రారంభమయ్యాయన్నారు. పాలేరు నియోజకవర్గంలో ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేసి యూరియాను అందిస్తామని చెప్పినా ఆచరణలో రైతులకు మాత్రం యూరియా అందటం లేదన్నారు. పనులన్నీ వదిలి యూరియా కోసం తెల్లవారుఝాము నుంచే రైతులు క్యూలల్లో ఉండాల్సి వస్తున్నదన్నారు.

ఏచూరి, చిర్రావూరిలకు నివాళులు

ఏచూరి సీతారాం, చిర్రావూరి లక్ష్మీనర్సయ్యల ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని బండి రమేష్ కోరారు. శనివారం పద్మారెడ్డి భవన్‌లో జరిగిన వర్ధంతి సభలో సీతారాం ఏచూరి, చిర్రావూరి లక్ష్మీ నర్సయ్యలకు నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి తోటకూరి రాజశేఖర్, నాయకులు మల్లెల సన్మతరావు, ఎడవల్లి రమణారెడ్డి, బడేటి శ్రీను, ప్రసాద్, జువ్వాజి శ్రీను, వెంకటయ్య, సురేష్, ఉపేందర్‌గంగాధర్ పాల్గొన్నారు.

ప్రధాని జన్మదినం సందర్భంగా సేవా కార్యక్రమాలు

యువమోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు

తిరుమలాయపాలెం, సెప్టెంబరు13 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ జన్మదిన సందర్భంగా సెప్టెంబరు 15నుంచి అక్టోబరు 2వరకు సేవాకార్యక్రమాలు నిర్వహించాలని యువమోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నలమాస శ్రీనివాస్ తెలిపారు. శనవారం మండలంలోని పాతర్లపాడులో పార్టీకార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నరేంద్రమోదీ జన్మదినం సందర్భంగా రక్తదాన శిబిరాలు, స్వచ్ఛభారత్, నమో మారథాన్, దివ్యాంగులకు సన్మాన కార్యక్రమాలు అక్టోబరు 2న మహాత్మాగాంధీ, లాల్‌బహుదూర్ శాస్త్రికి నివాళులర్పించడం జరుగుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బొడ్డుపల్లి ప్రసాద్, గుండా శ్రీనివాసరెడ్డి నల్లగట్టు శ్రీనివాస్, మేకా సంతోష్‌రెడ్డి, వీరభద్రం, సందీప్, శరత్, సంతోష్ పాల్గొన్నారు.

ఖాళీ ప్లాట్లు.. మునిసిపాలిటీ పాట్లు

- పేరుకుపోతున్న చెత్త, మురుగు
- దోమలతో జ్వరాల బారిన పడుతున్న ప్రజలు
- ఏదులాపురంలో పట్టించుకోని అధికారులు





పెద్దతండా పరిధిలో ఖాళీప్లాట్లలో చెట్లు

ఖమ్మంరూరల్, సెప్టెంబరు13(ఆంధ్రజ్యోతి): ఏదులాపురం మునిసిపాలిటీలో ఖాళీ ప్లాట్ల సమస్య ప్రజలను తీవ్రంగా వేధిస్తోంది. జనవాసాల మధ్య ఉండటంతో వర్షాలకు నీరు చేరి దోమలు, విషసర్పాలు పెద్దఎత్తున చేరుతున్నాయి. ఈ కారణంగా ప్రజల విషజ్వరాల బారిన పడుతున్నారు. విషసర్పాలు రాత్రిసమయంలో ఇళ్లలోకి చేరుతున్నాయి. ఖాళీస్థలాల మూలంగా ప్రజలు తీవ్రఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ ప్లాట్ల యజమానులు జరిమానా విధించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

70 వేల ప్లాట్లు

ఏదులాపురం మునిసిపాలిటీ పరిధిలో మొత్తం 12 గ్రామాలు విలీనం అయ్యాయి. పెద్దతండా, ఏదులాపురం, గుర్రాలపాడు, గుదిమళ్ల, మద్దులపల్లి, తెల్దారుపల్లి, ముత్తగూడెం, పల్లెగూడెం, పాలేపల్లి, వెంకటగిరి, బారుగూడెం, గొల్లగూడెం, గ్రామాలను కలుపుతు ఇటీవల నూతన మునిసిపాలిటీ ఏర్పాటు చేశారు. మొత్తం 32వార్డులుగా విభజించారు. మొత్తం 36వేల జనాభా, 20 వేల ఆవాసాలు ఉన్నాయి.అధికారుల లెక్కల ప్రకారం 70వేల ఖాళీప్లాట్లు ఉన్నట్లు తేల్చారు. అంటే ఇళ్ల కంటే ఖాళీ స్థలాలే మూడురెట్లు అదనంగా ఉన్నాయి.

జరిమానా విధించాలని డిమాండ్

మునిసిపాలిటీ పరిధిలో మొత్తం 70 వేల ప్లాట్లు ఉన్నాయి. మట్టిపోసుకుని కాంపౌండ్ చేసుకోవాలని యజమానులకు అధికారులు చెప్పినా పట్టించుకోడంలేదు. అయితే ఈ ప్లాట్లకు మున్సిపల్ చట్టం ప్రకారం వీఎల్‌టీ, (వేకెంట్‌ల్యాండ్ ట్యాక్స్) ఒక్కో ఫ్లాట్‌కు రూ.10వేల చొప్పున జరిమానా విధించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. దీంతో రూ.70 కోట్ల ఆదాయం వస్తుందని చెబుతున్నారు. దీనితో ఆదాయం తోపాటు ఖాళీ ప్లాట్లు బాగుపడతాయని సూచిస్తున్నారు.

యజమానులను గుర్తించే పనిలో ఉన్నాం
శ్రీనివాస్ రెడ్డి, మునిసిపల్ కమిషనర్

ఎక్కడా లేని విధంగా మునిసిపాలిటీ పరిదిలో 70 వేల ప్లాట్లు ఉన్నాయి. వాటి యజమానుల అడ్రస్ పట్టుకోవడం కష్టతరంగా మారింది. అడ్రస్ తెలిసిన వారికి నోటీసులు జారీ చేస్తున్నాం. స్థలాల యజమానులను గుర్తించిన తరువాత జరిమానా విధిస్తాం.

రైతులపట్ల దురుసుగా ప్రవర్తించిన ఏఈఓలను సస్పెండ్ చేయాలి

బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు శీను

కామేపల్లి,సెప్టెంబరు13(ఆంధ్రజ్యోతి): రైతులు యూరియా కూపన్లు అడిగితే దురుసుగా ప్రవర్తించిన ఇద్దరు ఏఈఓలను సస్పెండ్ చేయాలని బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు జాలె శ్రీను యాదవ్ అన్నారు. శనివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. రైతులు యూరియా అడిగితే వారి వారిపై కేసులు పెడతామని చెప్పి భయభ్రాంతులకు గురి చేయడం అమానుషమని అని అన్నారు. ఏఈఓలు స్థానిక పోలీస్ స్టేషన్‌లో రైతుపై ఫిర్యాదు చేస్తారాఅని ప్రశ్నించారు.

లయన్స్ క్లబ్ సేవలను విస్తరిస్తాం

క్లబ్ అధ్యక్షుడు జగదీష్‌బాబు



ఖమ్మంఖానాపురం హవేలి, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): పేద ప్రజలకు సేవ చేయటమే లక్ష్యంగా లయన్స్ క్లబ్ సేవలను మరింత విస్తరిస్తామని ఖమ్మం లయన్స్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ కే.జగదీష్‌బాబు అన్నారు. శనివారం నగరంలోని లయన్స్‌క్లబ్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వృద్ధులకు, ఎలాంటటి ఆదరణలేని మహిళలకు, విద్యార్థులకు అండగా ఉంటామని చెప్పారు. రెండు నెలలో రూ.లక్ష విలువగల వివిధ రకాల సేవా కార్యక్రమాలు నిర్వహించామన్నారు.

బతుకమ్మ వేడుకలకు ప్రతిమలు

ఖమ్మంఖానాపురంహవేలి,సెప్టెంబరు13(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో ఈనెల22 నుంచి నిర్వహించే బతుకమ్మ వేడుకలు అంగరంగవైభవంగా నిర్వహించనున్నారు. దీనిలో భాగంగా బతుమ్మ విగ్రహాలను పలు ప్రాంతాలలో ప్రతిష్ఠించి వేడుకలు నిర్వహిస్తారు. శనివారం మధిర నుంచి వరంగల్‌కు బతుకమ్మ విగ్రహాలతో ఓ ఆటోలో వెళుతున్న విగ్రహాలను శనివారం నగరంలోని బైపాస్ రోడ్‌లో ఆంధ్రజ్యోతి తన కెమెరాలో బంధించింది. ఈ విగ్రహాలను విజయవాడకు చెందిన గోదా. కృష్ణ తయారు చేసి వరంగల్‌లోని ఎండోమెంట్ రిటైర్డ్ అధికారికి విక్రయిస్తున్నట్లు తెలిపాడు. బతుకమ్మ విగ్రహాలు జత రూ. 80వేలకు విక్రయిస్తున్నట్లు తెలిపాడు.



కాంగ్రెస్‌లోనే బీసీలకు సరైన న్యాయం

రాపర్తి శరత్‌కుమార్ పుట్టిన రోజు వేడుకల్లో ఏఎంసీ చైర్మన్



శరత్ జన్మదిన వేడుకల దృశ్యం

ఖమ్మంసంక్షేమవిభాగం, సెప్టెంబరు13 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీలోనే వెనుకబడిన తరగతులకు సరైన రాజకీయ, సామాజిక న్యాయం జరుగుతుందని ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ యరగర్ల హనుమంతరావు పేర్కొన్నారు.శనివారం ఖమ్మం నగరం రాపర్తినగర్‌లో నిర్వహించిన పార్టీ సమావేశంలో 50వ డివిజన్ కార్పొరేటర్ రాపర్తి శరత్‌కుమార్ పుట్టినరోజు వేడుకలను నిర్వహించారు. భారీ కేక్ కట్ చేసి శరత్‌కుమార్‌ను అభినందించారు.ఖమ్మం నగరం అభివృద్ధిలో రాపర్తి కుటుంబ సభ్యులు చేసిన పనులను గుర్తు చేశారు. సీనియర్ నాయకులు పొదిల రవికుమార్, శెట్టి రంగారావు, పసుపులేటి వీరబాబు, కట్ల రంగారావు, కనిశెట్టి నర్సయ్య, ఆర్‌జేసీ కృష్ణ,చామకూరి వెంకటనారాయణ, పసుపులేటి నర్సయ్య, పసుపులేటి దెవేందర్, మడూరి పూర్ణచంద్రరావు,యాసా రామారావు,చౌడం నర్సింహారావు, జీవిఎల్ నర్సింహారావు, శ్రీహరి, సముద్రాల శ్రీనివాసరావు విడివిడిగా రాపర్తి శరత్‌కుమార్‌ను సన్మానించారు.

రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నేలకొండపల్లి అధ్యక్షుడిగా ఈశ్వరప్రగడ



నేలకొండపల్లి,సెప్టెంబరు13(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం, నేలకొండపల్లి యూనిట్ అధ్యక్షుడిగా ఈశ్వరప్రగడ రంగారావు ఎన్నికయ్యారు. శనివారం సింగారెడ్డిపాలెం ప్రాథమిక పాఠశాలలో జరిగిన రిటైర్డ్ ఉద్యోగుల సమావేశంలో జిల్లా అధ్యక్షుడు కల్యాణం కృష్ణయ్య మాట్లాడుతూ హెల్త్ కార్డులు, డీఏ, పీఆర్సీలు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం 2025-2028 సంవత్సరాలకు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఈశ్వరప్రగడ రంగారావు, కార్యదర్శిగా పిన్నెబోయిన వెంకటేశ్వరరావులతో పాటు మరో 9మందితో కూడిన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కృష్ణ, సుబ్బయ్యలు ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు. సమావేశంలో మండల విద్యాధికారి బాలిన చలపతిరావు మాట్లాడారు. కార్యక్రమంలో కల్యాణం సుదర్శనరావు, మచ్చా చంద్రశేఖరరావు, నరసయ్య, తిరపతయ్య పాల్గొన్నారు.

విద్యానగర్ వాసుల పాదయాత్ర

రహదారులు, తాగునీటి సౌకర్యాలు కల్పించాలని డిమాండ్



పాదయాత్ర చేస్తున్న కాలనీ వాసులు

ఖమ్మంకార్పొరేషన్, సెప్టెంబరు13 (ఆంధ్రజ్యోతి): 14 సంవత్సరాల నుంచి విద్యానగర్‌లో నివాసం ఉంటున్న కనీస సౌకర్యాలు ఖమ్మం నగర పాలక సంస్థ నుంచి అందలేదని ఆరోపిస్తూ విద్యానగర్ వాసులు పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు బండి నర్సింహారావు మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల నుంచి విద్యానగర్‌లో నివాసం ఉంటున్న కార్పొరేషన్ నుంచి ఎటువంటి అభివృద్ధి జరగలేదని ఆరోపించారు. రోడ్లు, డ్రెయినేజీలు, పారిశుధ్యం, విద్యుత్, వీధిదీపాలు అధ్వానంగా ఉన్నాయన్నారు. రహదారులకు కనీసం వీధి నెంబర్లు ఏర్పాటు చేయలేదని విమర్శించారు. వర్షాకాలంలో మురుగు నీరు చేరి ప్రజలు ఇబ్బందులకు గురైతున్నామన్నారు. స్థానికంగా ఉన్న సమస్యలపై సర్వే నిర్వహించి మేయర్‌కు కమిషనర్‌కు ప్రతిపాదిస్తామన్నారు. పాదయాత్రను స్థానిక కార్పొరేటర్ దండా జ్యోతిరెడ్డి ప్రారంభించారు. యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరరావు, రైతు సంఘం నాయకులు బత్తిన ఉపేంద్ర సంఘీభావం తెలిపారు. కాలనీ వాసులు బానోత్ బాలునాయక్, జాలాది లెనిన్, గోదా వెంకట నాగమల్లేశ్వరరావు, బండి నాగేంద్ర, వసుంధర, తూము రాంబాబు, రబ్బానీ, జగదీష్, వెంకటేశ్వరరెడ్డి, రేగులగడ్డ రామారావు, బసవ నాగేశ్వరరావు, పద్మ, పద్మారాణి, శ్రీనివాస్, మస్తాన్, బీ.శంకర్‌రావు, కృష్ణ పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

సమస్త ప్రజానీకానికి నా క్లయింటు చెరుకుమల్లి వెంకటేశ్వర్లు గారి సూచలన మేరకు తెలియజేయునది, నా క్లయింటు యాజమాన్య హక్కు భుక్తములో ఉన్న ఇంటి నెం: 11-5-7/1, నెహ్రూనగర్‌లో గల ఆస్తిలో కొంతభాగం నా క్లయింటు పసుమర్తి సాయి పేర దస్తావేజు నెం: 7141/2024 Dt: 12-07-2024 ద్వారా అమ్మిఉన్నారు. మిగతా భాగం నా క్లయింటు యొక్క స్వాధీన యాజమాన్య హక్కు భుక్తములో కలదు. దస్తావేజు 7141/2024 Dt: 12-07-2024 సవరణకు రాని కారణంగా పసుమర్తి సాయి మరియు పసుమర్తి లక్ష్మణ్ రావులను ప్రతివాదులుగా చూపుతూ నా క్లయింటు గౌరవనీయ ఖమ్మం జిల్లా కోర్టు నందు O.S.No: 63/2025 (Suit for Declaration and Rectification of Sale Deed No: 7141/2024 Dt: 12-07-2024) సవరణకు రావలసినదిగా ఆదేశించాలని కోర్టు వారిని కోరుతూ దావా వేసి ఉన్నారు. కావున క్రింది షెడ్యూలు ఆస్తిపై ఎవరైననూ ఎటువంటి లావాదేవీలు జరిపిన చట్టపరంగా చెల్లనేరవు మరియు వారు చట్టపరంగా Bonafied కొనుగోలుదారులుగా పరిగణించబడరు మరియు నా క్లయింటు తీసుకొను చట్టపరమైన చర్యలకు బాధ్యులవుదురు.

షెడ్యూలు ఆస్తి: ఖమ్మం జిల్లా అశ్యూరెన్సుల రిజిస్ట్రారు మరియు ఖమ్మం జాయింటు సబ్-రిజిస్ట్రారు వారి అధికార పరిధిలోని, ఖమ్మం జిల్లా, ఖమ్మం అర్బన్ మండలము, ఖమ్మం నగర పాలక సంస్థ పరిధిలోని, నెహ్రూనగర్ నందు గల ప్లాటు నెంబరు: 2, మొత్తం విస్తీర్ణం: 520.00చదరపు గజములు లేక తత్సమానము: 434.77చదరపు మీటర్లు గల స్థలము - అందులో నాచే నిర్మితమైన బహుళ అంతస్తుల భవనము, RCC Roof Building, total Plinth Area: 10109.42 Square Feet, bearing H.No: 11-5-7/1, (PTIN No. 11060 60378), అందుగల శానిటరీ, ఎలక్ట్రికల్, ప్లంబింగ్ ఫిట్టింగ్స్, Electricity, TGNPDCL Service Connections, Water Tap Connection, Borewell, Motor, Sump, Staircase, Ways, Passages, Balconies, Corridors, Portico, Compound Walls, Lift, Tranformers, Generators, Overhead Watertank, Drainage, All Amenities, Facilities & Fixtures, Easements, etc. యుక్తముగా గలట్టి స్థిరాస్తి విక్రయము ఇందుకు సరిహద్దులు: **తూర్పు:** House of M.KISHORE, H.No: 11-5-3, **దక్షిణం:** Building of MD.HASAN JALEEL & KHASAN JALEEL, H.No: 11-5-7/3, **పడమర:** 30'Feet wide Municipal Road, **ఉత్తరం:** Building belongs to ELURI VASANTHA, W/o. VENKATESWARA RAO, H.No: 11-5-7/2 (BALAMITRA CHILDREN HOSPITAL) పై సరిహద్దుల మధ్యనున్నట్టి స్థిరాస్తి, పై రీతిగా, మీకు విక్రయించబడి భౌతికముగా మీ స్వాధీనము చేయబడినది.

సం/- Sk.అక్బర్‌పాషా, M.K.హుస్సేన్, అడ్వకేట్స్
నెహ్రూనగర్, ఖమ్మం. Cell: 9399311674

స్థానిక ఎన్నికల్లో యువజన కాంగ్రెస్‌కు సీట్లు కేటాయించాలి

యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు వెజండ్ల



జిల్లా నివేదికను చెపుతున్న వెజండ్ల

ఖమ్మం సంక్షేమవిభాగం, సెప్టెంబరు13 (ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో యువజన కాంగ్రెస్ క్యాడర్‌కు 20శాతం స్థానాలు కేటాయించాలని జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు వెజండ్ల సాయి కోరారు. శనివారం హైదరాబాద్ గాంధీ భవన్‌లో నిర్వహించిన రాష్ట్రఎగ్జిక్యూటీవ్ సమావేశంలో సాయి మాట్లాడారు. జిల్లాలో యువజన కాంగ్రెస్ ప్రాముఖ్యత, గత ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపులో యువజన కాంగ్రెస్ పాత్రను వివరించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కనీసం 20శాతం రిజర్వేషన్ ఇవ్వటం ద్వారా భవిష్యత్‌లో కాంగ్రెస్ పార్టీకి ఇంకా మంచి క్యాడర్ పెరుగుతుందని తెలిపారు. రాహుల్‌గాంధీ పిలుపుమేరకు జిల్లాలో నిర్వహించిన ఓటు చోరీ కార్యక్రమం వివరాలను తెలిపారు.ఈమేరకు రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షులు జక్కిడి శివచరణ్, టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్‌కుమార్, టీపీవైసీ ఇన్‌చార్జీ ఖలీద్‌కు వినతిపత్రాలను అందించారు. ఈ సమావేశంలో జనరల్ సెక్రటరీలు, నియోజకవర్గ అధ్యక్షుడు, సోషల్ మీడియా సమన్వయకర్తలు పాల్గొన్నారు.

పారా బ్యాడ్మింటన్ పోటీల్లో కాంస్య పతకం

ఖమ్మం స్పోర్ట్స్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఇటీవల లక్నోలో జరిగిన జాతీయస్థాయి జూనియర్ పారా బ్యాడ్మింటన్ పోటీల్లో తమ పాఠశాల విద్యార్థిని ఆస్మా రూహి కాంస్య పతకం సాధించిందని పాఠశాల కరస్పాండెంట్ నిర్మల్‌హృదయ్ పాఠశాల అధినేత వంగా సాంబశివరెడ్డి తెలిపారు. శనివారం పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో ఆస్మాను అభినందించారు. భవిష్యత్ పోటీలలో రాణించి ఖమ్మం జిల్లాకు ఖ్యాతిని తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ సుధాకర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ పద్మజ పలువురు ఉపాధ్యాయులు ఉన్నారు.



డెంగీ.. దడ!

(5వ పేజీ తరువాయి)

తదితర శాఖల మధ్య సమన్వయం లోపించడంతోనే జిల్లాలో డెంగ్యూకేసుల నమోదుకు కారణమవుతోంది. ముందస్తు చర్యలు చేపట్టాల్సి ఉండగా కేసులు నమోదయినప్పుడు హడావిడి చేయడం తప్ప నిరోధించడంలో వైఫల్యం కనిపిస్తోంది. డెంగీ కేసులు వచ్చిన తర్వాత పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించడం కంటే, కేసులు నమోదు కాకముందే చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టితో పాటు రాష్ట్ర స్థాయి అధికారులు పలు సమావేశాల్లో ఆదేశిస్తున్నా అది క్షేత్రస్థాయిలో మాత్రం అమలవడంలేదు. పంచాయతీరాజ్, వైద్యారోగ్యశాఖ, గ్రామీణాభివృద్ధి శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించినా శాఖల మధ్య సమన్వయం కొరవడి ఎవరికి వారే అనే విధంగా పనులు చేపడుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

హెచ్చరించినా ఆగని ప్రైవేట్ దోపిడీ

జిల్లాలో ప్రైవేటు ఆసుపత్రుల దోపిడీకి అడ్డుకట్ట వేసేందుకు టీ-హబ్ కేంద్రంలో నిర్ధారణ తర్వాతే డెంగీ కేసుల వివరాలు వెల్లడించాలని వైద్యారోగ్య కుటుంబ శాఖ కార్యదర్శి ఆదేశాలు జారీచేశారు. జిల్లా కేంద్రంలోని టీహబ్ సక్రమంగా పనిచేయడం లేదు. జిల్లా ఆస్పత్రిలోనూ డెంగ్యూ నిర్ధారణ చేస్తున్నట్లు ప్రజలకు అవగాహనే లేదు. దీంతో ప్రైవేటు ఆసుపత్రుల నిర్వాహకులు ప్లేట్లెట్స్ సంఖ్య తగ్గగానే డెంగీ కేసుగా నిర్ధారిస్తూ రోగిని భయపెడుతున్నారు. ఆయా ఆసుపత్రులపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు అమ్యామ్యాయలతో సరిపెట్టుకుంటున్నారు. ఈ క్రమంలో ఉన్నతాధికారులు హెచ్చరికలు చేస్తున్నా పెడచెవిన పెడుతున్నారు.

పోరాట యోధుడు షోయబుల్లాఖాన్

బీజేపీ జాతీయ నాయకుడు పొంగులేటి సుధాకర్‌రెడ్డి



షోయబుల్లాఖాన్‌కు నివాళులర్పిస్తున్న పొంగులేటి

తిరుమలాయపాలెం,సెప్టెంబరు13(ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాయుధ పోరాట యోధుడుషోయబుల్లాఖాన్‌అని ఆయన్ను స్ఫూర్తిగా తీసుకుని యువత ముందుకు సాగాలని బీజేపీ జాతీయ నాయకుడు, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల ఇన్‌చార్జి పొంగులేటి సుధాకర్‌రెడ్డి తెలిపారు. శనివారం మండలంలోని సుబ్లేడులో షోయబుల్లాఖాన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరు కోటేశ్వరరావు, జిల్లా కన్వీనర్ నున్నా రవికుమార్, కోశాధికారి దేవకి వాసుదేవరావు, దొంగల సత్యనారాయణ, విజయారెడ్డి, గడ్డం వెంకటేశ్వర్లు, నల్లగట్టు ప్రవీణ్, గొంగూర వెంకటేశ్వర్లు, షర్ఫుద్దీన్ తదితరలు పాల్గొన్నారు.

గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

ఖమ్మంరూరల్, సెప్టెంబరు13 (ఆంధ్రజ్యోతి): ఏదులాపురం మునిసిపాలిటీ పరిధిలోని మద్దులపల్లి పరిధిలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీకళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం ప్రవేశాలకు స్పాట్ అడ్మిషన్ ప్రక్రియను విడుదల చేసినట్లు కళాశాల ప్రిన్సిపల్ సునీత శనివారం ఓప్రకటనలో తెలిపారు. వివిధ కోర్సుల్లో సీట్లు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. ఈనెల 15,16,18లోగా దోస్త్ రిజిస్ట్రేషన్ చేసుకుని కళాశాలలో ఒరిజినల్ సర్టిఫికెట్ల జిరాక్స్ అందించాలన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ 7995010677 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

మృతుల కుటుంబాలకు యాదవ సంఘం నాయకుల నివాళి



చింతకాని, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నాగులవంచ గ్రామానికి చెందిన తోట లక్ష్మణ్ రావు, సీతంపేట గ్రామానికి చెందిన సారిక బాబురావు ఇటీవల మృతిచెందడంతో శనివారం వారి దశదిన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మృతుల చిత్రపటాలకు డీసీసీబీ డైరక్టర్ మేకల మల్లిబాబు, అఖిల భారత యాదవ సంఘం అధ్యక్షుడు చిత్తారు సింహాద్రి, కామేపల్లి సొసైటీ చైర్మన్ పుచ్చకాయల వీరభద్రం, మాజీ కార్పోరేటర్ చేతుల నాగేశ్వరరావు, ఇమ్మడి లక్ష్మయ్య బట్టు తిరుపతయ్య, రామారావు, చిర్రా లింగయ్య, సారిక పాపారావు, రాము నివాళులర్పించారు.

కాంగ్రెస్ పాలనలోనే అభివృద్ధి



చెక్కులను అందిస్తున్న ఎమ్మెల్యే రాగమయి

కల్లూరు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకే అన్ని విధాలుగా అభివృద్ధిలో ముందుకు సాగుతున్నామని సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి అన్నారు. కల్లూరులో శనివారం ఎమ్మెల్యే రాగమయి చేతుల మీదగా సీఎం రిలీఫ్ ఫండ్ రూ.28.82 లక్షలు, కళ్యాణ లక్ష్మి రూ.22.2 లక్షల విలువలు గల చెక్కులను పలువురు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇందిరమ్మ రాజ్య పాలనలోనే ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. సబ్‌కలెక్టర్ అజయ్‌యాదవ్, ఏఎంసి చైర్మన్ బాగం నీరజదేవి, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు పసుమర్తి చందర్‌రావు, తహసిల్దార్ సాంబశివుడు, నాయకులు తక్కెళ్లపాటి ప్రసాద్, పోట్రు అర్జున్‌రావు ఏనుగు సత్యంబాబు, బాగం ప్రభాకరచౌదరి, భూక్యా శివకుమార్‌నాయక్, ఎస్‌కె ఉస్మాన్, కీసర మధుసుధన్‌రెడ్డి, పెద్దబోయన శ్రీను, పాల్గొన్నారు,

తల్లాడ: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో పేదల అభ్యున్నతికోసం నిరంతరం సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి తెలిపారు. శనివారం తల్లాడ రైతువేదికలో కళ్యాణ లక్ష్మి, షాదీముబారక్, సీఎంరిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు అందించారు. ఏఎంసీ చైర్మన్ బాగం నీరజ, ఎంపీడీవో సురేష్‌బాబు, సొసైటీ చైర్మన్ తూము వీరభద్రరావు, బ్లాక్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రఘుపతిరెడ్డి, కాపా సుధాకర్, నాయకులు జక్కంపుడి కిషోర్, శ్రీనివాసరావు, రాయల రాము, అడపా అనిల్, తాళ్ల జోసఫ్, గుర్రం శ్రీనివాసరావు, కృష్ణారావు, మాజీ జడ్పీటీసీ కె.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పెనుబల్లి: అనారోగ్యానికి గురైన సందర్భంలో ఆరోగ్యశ్రీ పరిధిలోకి రాని రోగులు హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రి సేవలను వినియోగించుకోవాలని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి సూచించారు. శనివారం స్థానిక రైతువేదికలో కల్లూరు సబ్‌కలెక్టర్ అజయ్‌యాదవ్‌తో కలిసి ఆమె పలువురు బాధితులకు రూ.98లక్షల పైచిలుకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఎంపీడీవో అన్నపూర్ణ, తహసీల్దార్ ఎస్వీ.నారాయణమూర్తి, ఏఎంసీ వైస్‌చైర్మన్ రాజబోయిన కోటేశ్వరరావు, నీలాద్రీ ఆలయ చైర్మన్ చీకటి నర్సింహారావు, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పంది వెంకటేశ్వరరావు, నాయకులు పొట్లపల్లి వెంకటేశ్వరరావు, వంకాయలపాటి వెంకటేశ్వరరావు, కీసర శ్రీనివాసరెడ్డి, సోమరాజు పాల్గొన్నారు.

డ్రైయినేజీ నీరు తరలింపు

» ఎమ్మెల్యే రాగమయి ఆదేశాలతో స్పందించిన అధికారులు

కల్లూరు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) కల్లూరులోని పలు ప్రధాన రహదారులపై శనివారం కురిసిన భారీ వర్షంతో వరదనీరు డ్రైనేజీలో పొటెత్తి ముందుకు సాగని పరిస్థితి ఏర్పడింది. దీంతో స్థానికంగా పంచాయితీరాజ్ ఇంజనీరింగ్ శాఖ కార్యాలయం వద్ద గల డ్రైనేజీతో పాటుగా విద్యానగర్ రహదారి వైపున వరద నీరు పోటెత్తి గృహాలలోకి చేరే ఆవకాశం ఏర్పడింది. దీంతో తల్లాడలో అధికారికి పర్యటన ముగించుకొని కల్లూరు వైపు నుంచి సత్తుపల్లి వైపుకు సాయిత్రం 4 గంటల సమయంలో వెళ్లుతున్న ఎమ్మెల్యే రాగమయి డ్రైనేజీల్లో నిల్వ ఉన్న వరద నీటిని తరలించేలా చర్యలు చేపట్టాలని మునిసిపాలిటీ అధికారులను ఆదేశించగా మేనేజర్ నందిశెట్టి నాగేశ్వరరావు తక్షణమే జెసిబి సహాయంతో తగిన చర్యలు చేపట్టారు. దీంతో పరిసర ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. ఈ సందర్భంగా స్థానికులు ఎమ్మెల్యే రాగమయికి అభినందనలు తెలిపారు.



విద్యానగర్‌లో డ్రెయినేజీలో నీటిని తరలిపు చర్యలు చేపట్టిన మునిసిపాలిటీ అధికారులు

భారీ వర్షం.. రోడ్లు జలమయం

» మాటూరుపేటలో పొంగి ప్రవహిస్తున్న వాగు.. రాకపోకలకు అంతరాయం



మాటూరుపేటలో ప్రధాన రహదారిపై పోటెత్తిన వాగు వరద

మధిరరూరల్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మధిర పట్టణంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో శనివారం ఉదయం నుంచి అల్పపీడన ప్రభావంతో భారీ వర్షం కురుస్తోంది. ఉదయం పదిగంటలకు ప్రారంభమైన వర్షం సాయంత్రం వరకు పడుతూనే ఉంది. వర్షం దంచికొట్టడంతో పలు గ్రామాల్లోని రోడ్లన్నీ జలమయమయ్యాయి. మండలంలోని మాటూరుపేట గ్రామంలో నడిభాగాన గల వాగు ఉధృతంగా పొంగి ప్రవహిస్తుండడంతో అంజనేయస్వామి గుడి సమీపంలో ప్రధాన రహదారిపై వరదనీటితో పోటెత్తింది. దీంతో మాటూరుపేట నుంచి మర్లపాడు వైపు వెళ్లే రోడ్డులో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అలాగే నిధానపురం, నాగవరప్పాడు, మాటూరు, మహదేవపురం, దెందుకూరు, ఖమ్మంపాడు తదితర గ్రామాల్లో రోడ్లన్నీ జలమయమయ్యాయి. ప్రజలు బయటకు రావాలంటేనే ఇబ్బందులు పడ్డారు. మండలంలోని మల్లారం గ్రామంలో ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారి వర్షాలతో చిత్తడిచిత్తడిగా మారింది. ఒకవైపు వర్షంతోపాటు మరోవైపు పెద్ద పెద్ద టిప్పర్లు ఈ రోడ్డుపై తిరుగుతుండడంతో స్థానికులు పెద్ద వాహనాలను నిలిపివేశారు. మండలంలోని చెరువులు, వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. చిలుకూరు గ్రామంలో కట్లేరు, వైరా నది ఏటి పరిహాక ప్రాంతంలోని పొలాల్లో భారీగా వరదనీరు చేరింది. మరో రెండురోజులు ఇలానే వర్షాలు కొనసాగితే పంటపొలాలకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

చింతకాని, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): చికిత్స పొందుతూ మండల పరిధిలోని నాగిలిగొండ గ్రామానికి చెందిన కొచ్చెర్ల కళ్యాణ్ (31) శుక్రవారం మృతిచెందాడు. మృతుడు ఆర్థిక ఇబ్బందులు తాళలేక మద్యానికి బానిసై ఈ నెల 11వ తేదీన పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ 12వ తేదీ సాయంత్రం మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. మాజీ జడ్పీ చైర్మన్ కమల్‌రాజు శనివారం పరామర్శించి మనోధైర్యాన్నిచ్చారు.

ఐదు క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

వైరా, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): వైరా మునిసిపాలిటీ 12వ వార్డులో అక్రమంగా నిల్వ ఉంచిన ఐదు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని శుక్రవారం రాత్రి పౌరసరఫరాలశాఖ అధికారులు పట్టుకున్నారు. సైదులు అనే వ్యక్తి లబ్ధిదారుల నుంచి సేకరించి అక్రమంగా రేషన్ బియ్యాన్ని నిల్వ చేశారనే సమాచారం మేరకు వైరా తహసీల్దార్, సివిల్‌సప్లయి ఆర్‌ఐ కిరణ్ దాడి చేసి స్వాధీనం చేసుకున్నారు.

డెంగీ.. దడ!

(5వ పేజీ తరువాయి)

తదితర శాఖల మధ్య సమన్వయం లోపించడంతోనే జిల్లాలో డెంగ్యూకేసుల నమోదుకు కారణమవుతోంది. ముందస్తు చర్యలు చేపట్టాల్సి ఉండగా కేసులు నమోదయినప్పుడు హడావిడి చేయడం తప్ప నిరోధించడంలో వైఫల్యం కనిపిస్తోంది. డెంగ్యూ కేసులు వచ్చిన తర్వాత పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించడం కంటే, కేసులు నమోదు కాకముందే చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టితో పాటు రాష్ట్ర స్థాయి అధికారులు పలు సమావేశాల్లో ఆదేశిస్తున్నా అది క్షేత్రస్థాయిలో మాత్రం అమలవడంలేదు. పంచాయతీరాజ్, వైద్యారోగ్యశాఖ, గ్రామీణాభివృద్ధి శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించినా శాఖల మధ్య సమన్వయం కొరవడి ఎవరికి వారే అనే విధంగా పనులు చేపడుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

హెచ్చరించినా ఆగని ప్రైవేట్ దోపిడీ

జిల్లాలో ప్రైవేటు ఆసుపత్రుల దోపిడీకి అడ్డుకట్ట వేసేందుకు టీ-హబ్ కేంద్రంలో నిర్ధారణ తర్వాతే డెంగ్యూ కేసుల వివరాలు వెల్లడించాలని వైద్యారోగ్య కుటుంబ శాఖ కార్యదర్శి ఆదేశాలు జారీచేశారు. జిల్లా కేంద్రంలోని టీ హబ్ సక్రమంగా పనిచేయడం లేదు. జిల్లా ఆస్పత్రిలోనూ డెంగ్యూ నిర్ధారణ చేస్తున్నట్లు ప్రజలకు అవగాహనే లేదు. దీంతో ప్రైవేటు ఆసుపత్రుల నిర్వాహకులు ప్లేట్లెట్స్ సంఖ్య తగ్గగానే డెంగ్యూ కేసుగా నిర్ధారిస్తూ రోగిని భయపెడుతున్నారు. ఆయా ఆసుపత్రులపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు అమ్యామ్యాయలతో సరిపెట్టుకుంటున్నారు. ఈ క్రమంలో ఉన్నతాధికారులు హెచ్చరికలు చేస్తున్నా పెడచెవిన పెడుతున్నారు.

సెక్యులర్ డెమోక్రసీ పాలన కోరుకున్న నేత ఏచూరి

వైరా, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): సెక్యూలర్ డమోక్రసీ పాలన కోరుకున్న ఉత్తమ రాజ్యసభ సభ్యుడు దివంగత సీతారాం ఏచూరి అని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు పేర్కొన్నారు. శుక్రరాత్రి రాత్రి వైరాలో సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో చింతనిప్పు చలపతిరావు అధ్యక్షతన జరిగిన సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి సభలో నున్నా ప్రసంగించారు. విద్యార్థి దశ నుంచి ఎస్‌ఎఫ్‌ఐలో అనేక పోరాటాలు నిర్వహించిన సీతారాం ఏచూరి అంచెలంచెలుగా ఎదిగి సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తూ అనారోగ్యంతో మృతిచెందడం తీరని లోటన్నారు. ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బొంతు రాంబాబు, నాయకులు తాళ్లపల్లి కృష్ణ, సుంకర సుధాకర్, మచ్చా మణి, తోట నాగేశ్వరరావు, పారుపల్లి కృష్ణారావు, మాజీ ఎంపీపీ సమత పాల్గొన్నారు.

'విజయ'లో ఘనంగా మొక్కలు నాటే కార్యక్రమం



మొక్కలు నాటుతున్న కళాశాల వైస్‌చైర్మన్ విజయలక్ష్మి

కొణిజర్ల, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక విజయ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం ఘనంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. దీంతో పాటు స్వచ్ఛ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా కళాశాల వైస్ చైర్మన్ పారుపల్లి విజయలక్ష్మి మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అన్నారు. ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని వాటిని సంరక్షించాలని కోరారు. ప్రిన్సిపాల్ చిన్నయ్య, వైస్‌ప్రిన్సిపాల్ ఆయేషాతరణం, శ్రీనివాసరావు, ఏవోఫరీద్‌బాబా, ఎన్‌ఎస్‌ఎస్‌యూనిట్ కో ఆర్డినేటర్ బాబులాల్ పాల్గొన్నారు.

సామాజిక సేవలపై విద్యార్థుల ప్రత్యేక కార్యక్రమం

కల్లూరు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కల్లూరులోని తెలంగాణ గ్రామర్ పాఠశాలలో శనివారం సామాజిక సేవ కార్యక్రమాలపై విద్యార్థులు ప్రత్యేక కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సమాజంలో వివిధ రంగాలలో సేవలందిస్తున్న ప్రముఖ వ్యక్తుల వహిస్తున్న వృత్తుల ప్రాధన్యంపై విద్యార్థులు ఆయా వేషధారణతో పాత్ర వహిస్తూ వివరించారు. ఇలా డాక్టర్‌గా, ఉపాధ్యాయుడిగా, పోలీస్, ఫైర్‌మాన్, రైతు, పోస్టుమాన్, పారిశుద్ధ్య కార్మికుల వంటి సేవకులు సమాజానికి ఎంత అవసరమో విద్యార్థులు నాటక రూపంలో ప్రదర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్‌కె ఇస్మాయిల్ మాట్లాడుతూ.. సమాజ సేవకులు లేకుండా మన జీవనం సజావుగా సాగదన్నారు. అందుకు తేటివారికి సేవలందించే వారిని ప్రతి ఒక్కరు గౌరవించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఈ కార్యక్రమం ద్వారా కృతజ్ఞత, గౌవరం, సహకారం వంటి విలువలను నేర్చుకున్నారు.



తెలంగాణ గ్రామర్ పాఠశాలలో పలు రకాల సామాజిక వేషధారణలో విద్యార్థులు

చిన్నచిన్న కేసులతో కక్షలు పెంచుకోవద్దు

» సత్తుపల్లి లోక్ అదాలత్‌లో 368కేసుల పరిష్కారం

» 6వ అదనపు జిల్లా న్యాయాధికారి మారగాని



సత్తుపల్లిలో కేసులను పరిష్కరిస్తున్న న్యాయాధికారి శ్రీనివాస్

సత్తుపల్లిరూరల్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాజీమార్గం రాజమార్గమని, చిన్నచిన్న కేసులతో కక్షలు పెంచుకుని కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయాన్ని, డబ్బులను వృధా చేసుకోవద్దని 6వ అదనపు జిల్లా న్యాయాధికారి మారగాని శ్రీనివాస్ సూచించారు. సత్తుపల్లి మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం స్థానిక కోర్టులో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించగా 368కేసులు పరిష్కారమయ్యాయి. అంతకముందు కోర్టు ఆవరణలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ.. లోక్ అదాలత్ ద్వారా కక్షిదారులు సత్వర న్యాయం పొందవచ్చని, లోక్ అదాలత్ సేవలు ప్రజలకు పూర్తిగా ఉచితంగా అందుతాయన్నారు. రాజీ పద్ధతిలో క్రిమినల్ కాంపౌండబుల్ కేసులు, అన్నిరకాల సివిల్ కేసులు పరిష్కరించుకోవచ్చునని, ఇలాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా క్రిమినల్ కాంపౌండబుల్ కేసులు, సివిల్ తగాదా కేసులు, ఆస్తి విభజన కేసులు, రోడ్డు ప్రమాదాలు, కుటుంబపరమైన కేసులు, వైవాహిక జీవితం సంబంధిత కేసులు, బ్యాంక్ రికవరీ, చెక్‌బౌన్స్ కేసులు ఇతర కేసులపై సంబందించిన కేసులను ఇరుపక్షాల సమ్మతితో రాజీతో పరిష్కారమయ్యే కేసులన్నింటినీ పరిష్కరించుకోవచ్చునన్నారు. సీనియర్ సివిల్ జడ్జి ఎస్‌కే.మీరాఖాసీమ్‌సాహెబ్, జూనియర్ సివిల్ జడ్జీ వడ్డి లావణ్య, సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ జే.గోపాలరావు, సత్తుపల్లి రూరల్ సీఐ ముత్తిలింగం, వేంసూరు ఎస్ఐ కవిత, బార్ అసోసియేషన్ అధ్యక్షుడువెంకటేశ్వరరావు, న్యాయవాదులు, కక్షిదారులు పాల్గొన్నారు.

మధిర: పలు కేసుల్లో కోర్టులు చుట్టూ తిరిగి డబ్బు, సమయం వృదా చేసుకోవడం కంటే లోక్ అదాలత్ ద్వారా రాజీపడి పరిష్కరించు కోవడమే ఉత్తమం అని మధిర కోర్టు న్యాయాధికారి, మండల న్యాయ సేవా అధికార సంస్థ చైర్మన్ ఎన్. ప్రశాంతి అన్నారు. జాతీయ మెగా లోక్ అదాలత్‌లో భాగంగా శనివారం మధిరలోని రెండు కోర్టులలో జరిగిన లోక్ అదాలత్‌ను ఆమె ప్రారంభించారు. కక్షిదారులు అనవసరమైన పట్టింపులకు పోకుండా కేసులను రాజీ చేసుకోవాలని జాతీయ మెగా లోక్ అదాలత్ ప్రతి మూడు నెలలకు ఒకసారి జరుగుతుందని దీనిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో 428, అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో 299 కేసులతో కలిపి మొత్తం 732 సివిల్, ఆస్తి తగాదా, కుటుంబ తగాదా, ఎక్సైజ్, క్రిమినల్, ఆక్సిడెంట్, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులను పరిష్కరించారు. న్యాయమూర్తులు వేముల దీప్తి, అబ్రహం, పబ్లిక్ ప్రాసిక్యూటర్ భద్రయ్య, బార్ అసోసియేషన్ అధ్యక్షులు బోజెడ్ల పుల్లారావు, కోర్టు పరిధిలోని సివిల్, ఎక్సైజ్ ఎస్ఐలు న్యాయవాదులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

» రైతుసంఘ రాష్ట్ర అధ్యక్షుడు బాగం హేమంతరావు

బోనకల్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): అకాల వర్షాల వల్ల పంటలు దెబ్బతినడంతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ రైతుసంఘ రాష్ట్ర అధ్యక్షుడు బాగం హేమంతరావు డిమాండ్ చేశారు. మండలంలోని గోవిందాపురం(ఎల్) గ్రామంలో శనివారం వర్షాభావంతో దెబ్బతిన్న పత్తి పంటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పంట ఏపుగా పెరిగిన తరుణంలో వర్షాల వల్ల పత్తికాయలు కుళ్లి పోతున్నాయని, పూత రాలుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 18 లక్షల హెక్టార్ల భూమిలో పత్తిని సాగు చేశారన్నారు. కౌలు రైతులకు ఎక్కువ నష్టం జరిగిందని, సర్వే చేసి పరిహారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, జక్కుల రామారావు, యంగల ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ మండల అధ్యక్ష పదవికి పుల్లయ్య రాజీనామా

» భట్టి అభివృద్ధిని చూసి కాంగ్రెస్‌లో చేరిక

చింతకాని, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ప్రాథమిక సభ్యత్వానికి, మండల అధ్యక్ష పదవికి పెంట్యాల పుల్లయ్య శనివారం రాజీనామా చేశారు. ఆ మేరకు పార్టీ జిల్లా అధ్యక్షుడు తాతా మధుకు, మధిర నియోజకవర్గ ఇంచార్జీ లింగాల కమల్‌రాజుకు రాజీనామ లేఖను సమర్పించారు. చింతకాని మండలం పొద్దుటూరు గ్రామానికి చెందిన పుల్లయ్య టీడీపీ మండల అధ్యక్షుడుగా సుదీర్ఘ కాలం పనిచేశారు. అనంతరం బీఆర్ఎస్‌లో చేరి మండల అధ్యక్ష పదవి చేతబట్టారు. గత పదేండ్లుగా బీఆర్ఎస్ మండల అధ్యక్షుడుగా పనిచేస్తున్నారు. మధిర నియోజకవర్గంలో వేల కోట్ల రూపాయలతో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అభివృద్ధి పనులు చేస్తున్నారని, అభివృద్ధిని చూసి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నానని తెలిపారు. ఇన్నాల్లు తనకు సహాయ సహకారాలు అందించిన నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.

జీవనజ్యోతి బీమా చెక్కు అందజేత

వైరా, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి జీవనజ్యోతి ప్రమాద బీమా కింద బాధిత కుటుంబానికి రూ.రెండులక్షల చెక్కును ఎస్‌బీఐ(సోమవరం) బ్రాంచ్ మేనేజర్ వేణు శనివారం అందజేశారు. స్థానిక బీసీ కాలనీకి చెందిన మర్సకట్ల వెంకటేశ్వర్లు ఎస్‌బీఐలో ప్రధానమంత్రి జీవన జ్యోతి బీమా కింద రూ.436ప్రీమియం చెల్లించి ఉన్నాడు. ఇటీవల వెంకటేశ్వర్లు ప్రమాదంలో మృతిచెందాడు. దాంతో వెంకటేశ్వర్లు కుమారుడు, భార్యకు రూ.రెండులక్షల బీమా చెక్కును మేనేజర్ వేణు అందజేశారు.

రైతు సమస్యలను కలెక్టర్‌కు వివరిస్తా

» సబ్‌కలెక్టర్ అజయ్‌యాదవ్



పెనుబల్లి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): గ్రీన్‌ఫీల్డ్ హైవే రోడ్డు పక్కన రైతులు అడుగుతున్న సర్వీస్ రోడ్ల విషయమై జిల్లా కలెక్టర్‌తో ముఖాముఖీ ఏర్పాటుచేయిస్తానని కల్లూరు సబ్‌కలెక్టర్ అజయ్‌యాదవ్ అన్నారు. శనివారం గ్రీన్‌ఫీల్డ్ హైవే కార్యాలయం వద్ద రైతులు రెండోరోజు నిర్వహిస్తున్న ప్రదేశానికి రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు మట్టా దయానంద్‌తో కలిసి సబ్‌కలెక్టర్ వెళ్లారు. వేంసూరు, పెనుబల్లి మండలాలకు చెందిన రైతులు సబ్‌కలెక్టర్ అజయ్‌యాదవ్‌కు తమ సమస్యలను విన్నవించారు. తహసీల్దార్ ఎస్వీనారాయణమూర్తి, ఎస్ఐ కె.వెంకటేష్, వేంసూరు, మండలాల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

రాఘవాపురంలో వానరానికి అంత్యక్రియలు



చింతకాని, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రాఘవాపురం గ్రామంలో శనివారం కరెంటు షాక్‌తో వానరం మృతిచెందింది. మృతి చెందిన వానరానికి గ్రామానికి చెందిన యువకులు శాస్త్రోక్తంగా అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో యువకులు అబ్బూరి మహేష్, కొల్లి నవీన్, నల్గొండ కార్తీక్, పుట్టబంతి వెంకన్న, జల్లి అంజీ పాల్గొన్నారు.



నిరుపేద కుటుంబానికి నిత్యావసరాలు అందిస్తున్న దృశ్యం

ఆ కుటుంబానికి సుధారాణి ఆసరా

● 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

సత్తుపల్లి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : గతనెల 23న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'వృద్ధాప్యం.. ఆ పై కుటుంబ భారం' అన్న కథనానికి స్పందన లభించింది. ఆ పేద కుటుంబానికి నిత్యావసరాలను అందించి ఆసరాగా నిలిచారు. పట్టణానికి చెందిన సుధా హెర్బల్ ఛారిటబుల్ ఫౌండర్, అనువంశిక ఆయుర్వేద వైద్యురాలు కొనకళ్ల సుధారాణి శనివారం స్థానిక ఎన్టీఆర్ నగర్‌లోని ఆ కుటుంబాన్ని సందర్శించారు. వృద్ధాప్యంలో కుటుంబాన్ని పోషించలేని మామిడి కటాక్షమ్మ, మానసికంగా అనారోగ్యంతో బాధపడుతున్న సుజాతలతో మాట్లాడి అండగా ఉంటానని భరోసా కల్పించారు. అదేవిధంగా రాజీవ్‌నగర్‌లో నివాసం ఉంటున్న పంజాబీ కుటుంబం గోపీ, లక్ష్మీలు అనారోగ్యంతో బాధపడుతూ తీవ్ర ఇబ్బందులో ఉండడంతో.. వారికి కూడా నెలకు సరిపడా నిత్యావసరాలను అందించారు. అదే విధంగా ఎన్టీఆర్ నగర్ జడ్పీఎస్ఎస్ ఉపాధ్యాయుడు కంభంపాటి వెంకటేష్ 52కేజీల బియ్యం, నిత్యావసర సరుకులతో పాటు నెలకు రూ.1000చొప్పున అందిస్తున్నారు.

డ్రెయినేజీల ఏర్పాటుకు ప్రతిపాదనలు

కారేపల్లి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కారేపల్లి క్రాస్‌రోడ్డులో సైడ్ కాల్వల ఏర్పాటు కోసం శనివారం సంబంధిత అధికారులు పరిశీలనచేసి ప్రతిపాదనలు రూపొందించారు. ఇటీవల బీఆర్ఎస్‌కు చెందిన ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధుసూధన్‌లు సైడ్ కాల్వలు లేక ఇబ్బందులు పడుతున్న ప్రాంతాలను స్థానికులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా పార్టీ బీఆర్ఎస్ నాయకులు ముత్యాలసత్యనారాయణ ఎంపీ, ఎమ్మెల్సీలను కలిసి సైడ్ కాల్వలు లేకపోవడంతో ప్రజలు పడుతున్న ఇబ్బందులను వివరించారు. దీంతో శనివారం పంచాయత్ రాజ్ ఏఈ రాజశేఖర్, వర్క్ఇన్స్‌పెక్టర్ వినయ్ పరిశీలించారు.

జీవో రద్దుకు హాస్టల్ వర్కర్ల నిరవధిక సమ్మె

కారేపల్లి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): గిరిజన ఆశ్రమ పాఠశాల హస్టల్స్‌లో పనిచేస్తున్న డైలీ వేజ్, పార్ట టైం వర్కర్లకు వేతనాల చెల్లింపుకు 2021జూన్-15న ఆర్థికశాఖ విడుదల చేసిన జీవోజ64ను నిలిపివేయాలని సీఐటీయూ మండల కన్వీనర్ కె.నరేందర్ డిమాండ్ చేశారు. శనివారం మండల పరిధిలోని శాంతినగర్, మేకలతండా, ఆశ్రమ పాఠశాలలు, మండల కేంద్రంలో ప్రభుత్వ కళాశాల వద్ద సమ్మె కేంద్రాన్ని సీఐటీయు నాయకులు కె.నరేందర్, నాయకులు శివనాయక్ సందర్శంచి సంఘీభావం ప్రకటించారు.

శరన్నవరాత్రి ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

వైరా, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): వైరా మునిసిపాలిటీ రెండోవార్డు హనుమాన్ బజార్‌లో ఉన్న శ్రీమహాలక్ష్మీ అమ్మవారి ఆలయంలో శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాల గోడపత్రికను శనివారం ఆలయ నిర్వాహకులు ఆవిష్కరించారు. ఈనెల 22నుంచి వచ్చేనెల రెండోతేదీ వరకు అంగరంగ వైభవంగా శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ప్రతిరోజూ నిర్వహించే బతుకమ్మల అలంకరణకు సంబందించి పోటీలు నిర్వహించి బహుమతులు అందజేస్తామని ప్రకటించారు. ఆలయ చైర్మన్ వేముల శివకృష్ణ, సభ్యులు బాలయ్య, పల్లపు కొండలు, ఆంజనేయులు, ఓర్సు శ్రీనివాసరావు, తిరుపతిరావు, తిరుపతి శ్రీను, బత్తుల విజయ్, ఉప్పు రామకృష్ణ, వల్లెపు కొండలు, దేవళ్ల గోవిందరావు, రాము పాల్గొన్నారు.

